J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 1 07.6.2024, శుక్రవారం వెల : రూ. 5 /-

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

బాబుకి 164

జగన్‌కి 11


అయిదేళ్ళు చాలని.. 5 కొట్టేశారు!

### విజ్ఞులైన ఆంధ్రా ఓటర్లు

# ఉతికి ఆరేశారు



## జగన్‌బాబు కంటే.. చంద్రబాబే మేలని తేల్చేశారు



వైసీపీ అద్రుస్ గల్లంతయ్యింది
అహంకారపు ఆధిపత్యంతో
అనుభవ రాహిత్యంతో
అధికార పైత్యంతో
అధఃపాతాళానికి పడిపోయింది

### 151 నుండి 164 వరకూ...

ఆంధ్రా ఓటర్లు తమ సత్తా చూపించారు. తమకి కావలసింది అభివృద్ధి, సంక్షేమం తప్ప ఉచిత తాయిలాలు, ఖాతాలలో డబ్బులు కాదని గట్టిగానే చెప్పారు. డబ్బులు ఎరవేసి తమని కొనాలని చూస్తే అర గుండు తప్పదని రుజువు చేశారు. నిశ్శబ్ద తిరస్కారంతో అధికార దురహంకారాన్ని అంధకారంలోకి పంపించేశారు. అనుభవ రాహిత్యంతో, అపరిపక్వ పరిపాలనతో (అసలు పరిపాలన ఉంటే కదా?), పదవీ పైత్యంతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేసిన పాలకుడికి, ఆయన బృందానికి విజ్ఞులైన ఆంధ్రా ఓటర్లు చరమగీతం పాడి ఉతికి ఆరేశారు. అనాధాంధ్రలో అసురుల్లా దాపురించిన నకిలీ నాయకులని తరిమికొట్టి, రాష్ట్రంపై ఏర్పడిన మకిలిని కడిగి పారేశారు. కూల్చివేతల పర్వంతో తన పరిపాలన ప్రారంభించిన నియంత పాలనను పంతంతో కూల్చేసి అంతం చేశారు.

గత ఎన్నికలలో 151 సీట్లు ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి నీకు మూడంకెల మెజారిటీ ఇచ్చి ముదనష్టాన్ని నెత్తిన పెట్టుకున్నాం, నీ అయిదేళ్ల పాలనకి గుర్తుగా మధ్యలో ఉన్న 5 ఎత్తేస్తున్నాం, అనే సంకేతాలు ఇచ్చేలా రెండొకట్లకి అంటే కేవలం 11 సీట్లకి పరిమితం చేసి ఘోర పరాజయాన్ని రుచి చూపించారు. జగన్ బాబు కంటే చంద్రబాబే మేలన్నట్లుగా తెలుగుదేశం కూటమికి 164 సీట్ల బలాన్ని ఇచ్చి పాలనా పగ్గాలు అప్పజెప్పారు.

దేశ రాజకీయ చరిత్రలోనే ఇదొక సంచలనాత్మక సంఘటన. గతంలో ఏ రాష్ట్రంలో జరగని రాజకీయ పరిణామం. గత ఎన్నికలలో మూడొంతులకి పైగా సీట్లిచ్చి గెలిపించిన పార్టీని, ఆ పార్టీ నాయకులని మళ్ళీ ఎన్నికలలో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేసి ఇంటికే పరిమితం చేయడం అంటే, అది ఆ పార్టీ పాలనపైనా, ఆ పార్టీ నాయకుడిపైనా ఆ రాష్ట్ర ప్రజలు చూపించిన తీవ్ర నిరసన తప్ప మరొకటి కాదు. అలాంటి నిరసన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేయవలసి రావడం దురదృష్టకరం.


### రాష్ట్రాన్ని...
### ఆంధ్రా కంపెనీగా అవతరింపజేశారు

వైసీపీ అధికారంలోకి వచ్చిన క్షణం నుండీ తీసుకున్న ప్రతీ నిర్ణయం ఆ పార్టీకి నష్టం చేసింది. పాలన తొలినాళ్లలో చేపట్టిన ప్రజావేదిక కూల్చివేత చర్య వైసీపీ అధినాయకుడి పని తీరుకి అద్దం పట్టింది. తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై పాలన సాగించిన తీరు ఆయన అంతరంగాన్ని

12లో

# మతం.. మా అభి'మతం' కాదు

## ఇది భారతీయ ఓటరు మనోగతం!!



మొత్తానికి పదేళ్ల పాలన తర్వాత మూడోసారి ఎన్నికల్లో **241** సీట్లను సొంతంగా సాధించి అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు కావలసిన సీట్లను మాత్రం సొంతంగా సాధించుకోలేక పోయింది. ఏదేమైనా పొత్తుల పుణ్యమాని మూడోసారి మోదీ ప్రభుత్వం కొలువుతీరబోతోంది. అబ్కీబార్ **400**పార్... పాచిక పారకపోయినా, హ్యాట్రిక్ విజయాన్ని తన ఖాతాలో వేసుకోగలిగింది. అద్భుతం అనలేకపోయినా, కష్టానికి తగిన ఫలితాన్ని మాత్రం సాధించుకోగలిగింది. మూడోసారి ప్రధానిగా ఓ చారిత్రక రికార్డును మోదీ తన ఖాతాలో వేసుకోగలుగుతున్నారు.

14లో

తెగిన బంధం

# హైదరాబాదు.. ఇక మనది కాదు!

హైదరాబాదుతో ఆంధ్రప్రదేశ్‌కు ఇన్నాళ్లుగా..ఇన్నేళ్ళుగా ఉన్న అనుబంధం తీరిపోయింది. రాష్ట్ర విభజన తర్వాత జూన్ 2 తేదీతో ఆ ఆత్మీయానుబంధానికి ఉన్న గడువు ముగిసిపోయింది. ఆంధ్రప్రజలకు హైదరాబాదు నగరంతో ఉన్న పేగుబంధం పుటుక్కుమని తెగిపోయింది. ఇక, మిగిలిపోయిన అవశేషాంధ్రకు రాజధాని ఏది?.. అనే విషయం నేటికీ నిర్ధారణ కాకపోవడంతో అనాథగా ఉన్న ఆంధ్రప్రజలకు ఆవేదనే మిగిలింది. కేంద్రంలో ఏర్పడనున్న బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోకి మళ్ళీ రానున్న తెలుగుదేశం ప్రభుత్వాల నిర్ణయాల మీదే ఇక ఆంధ్ర రాజధాని భవిష్యత్తు ఆధారపడివుంది. కొత్తగా ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా అన్నపూర్ణ వంటి ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని తెస్తారా?.. మళ్ళీ ఆంధ్రప్రదేశ్‌కు వైభవం వచ్చి కళకళలాడుతుందా.. అని ప్రజలు వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు.



## విశ్వనగరానికి వీడ్కోలు

రాష్ట్ర విభజన తర్వాత విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధానిగా హైదరాబాదు పదేళ్ళపాటు కొనసాగింది. జూన్ 2వ తేదీతో ఆ గడువు ముగిసిపోయినా ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పడకపోవడం దురదృష్టకరం. అప్పట్లో, అంటే 2014లో అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా అమరావతి ఆశలపై నీళ్ళు కుమ్మరించింది. ఒక రాజధాని కాదు, మూడు రాజధానులు ఉండాలని, విశాఖ నుంచి పాలన సాగిస్తామంటూ మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చింది. కానీ, ఏవీ ఆచరణలోకి రాకుండానే వైకాపా పాలన కూడా ముగిసిపోయింది.

హైదరాబాదుకు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. పూర్వకాలంలో అశోకచక్రవర్తి సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న ఈ నగరాన్ని ఆ తర్వాత శాతవాహనులు, చాళుక్యులు పాలించారు. కాకతీయుల కాలంలో హైదరాబాదులోని గోల్కొండ ప్రాంతంలో ఒక బృహత్తరమైన మట్టికోటను కూడా కట్టించారు. గోల్కొండ కోటగా అది ప్రసిద్ధి. ఆ తర్వాత కాలంలో నవాబులు, కుతుబ్‌షాహీల పాలన వచ్చింది. 1589 ప్రాంతంలో సుల్తాన్ మహమ్మద్ కులి కుతుబ్‌షా మూసీనది ఒడ్డున గోల్కొండకు తూర్పుదిశలో హైదరాదును కొత్తనగరంగా రూపుదిద్ది చార్మినార్‌ను నిర్మించారు. వీరి కాలంలోనే గోల్కొండ వజ్రాలకు, ముత్యాలకు పేరొందిన డెక్కన్ డైమండ్ సిటీగా హైదరాబాదు ప్రఖ్యాతి చెందింది. 1686లో ఔరంగజేబు గోల్కొండ కోటను ముట్టడించడం, ఆ తర్వాత బ్రిటిష్ వారి కాలంలో నిజాము పాలన కొనసాగడం, హైదరాబాదు సంస్థానాన్ని స్వతంత్రంగా ఉంచాలన్న నిజాము నిర్ణయానికి రజాకార్లు మద్దతునివ్వడం, దానిని వ్యతిరేకిస్తూ తెలంగాణలో కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేసి, రజాకార్ల అమానుషచర్యలను నిరోధించడం వంటివన్నీ చరిత్రలో ఎన్నో జరిగాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, హోంమంత్రి సర్దార్ వల్లభాయిపటేల్ పోలీసు చర్యతో 1948 సెప్టెంబరు 17 హైదరాబాదు సంస్థానం దేశంలో విలీనమైంది. అమరజీవి పొట్టి శ్రీరాములు బలిదానంతో భాషాప్రయుక్త రాష్ట్రాలు వచ్చాక 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం మద్రాసు రాష్ట్రం నుంచి విడివడి, కర్నూలు ఆంధ్రకు రాజధాని అయింది.

1956లో భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు హైదరాబాదు ఆంధ్ర రాష్ట్రంలో కలిసింది. 1956 నవంబరు 1న హైదరాబాదు ఆంధ్రరాష్ట్రానికి రాజధాని అయింది. అప్పటి నుంచి ఉన్న బంధానికి ఇప్పుడు తెరపడింది.

### అటు కళకళ..ఇటు వెలవెల :

ఓవైపు పదేళ్ల దశాబ్ది ఉత్సవాలతో తెలంగాణ ప్రజలు సంబరాలు చేసుకుంటుంటే, ఆంధ్ర ముఖం రాజధాని లేక వెలవెలబోతోంది. విభజన తర్వాత హైదరాబాద్‌కు ఆంధ్రప్రజల రాకపోకలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. నేటికీ కొన్ని భవనాలు, కార్యాలయాలు తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి. విభజన చట్టం ప్రకారం ఇంకా చేయాల్సిన ఆస్తుల విభజన కూడా పూర్తికాలేదు. కోట్లాదిరూపాయల విలువ గల ఆస్తుల విషయం నేటికీ కొలిక్కి రానే లేదు. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించి, తెలుగుదేశం ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టనున్న నేటి తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతినే కొనసాగించే అవకాశం ఉంటుందని అంటున్నారు కానీ, తుది నిర్ణయాలు జరగాల్సి ఉంది. విభజన చట్టం ప్రకారం షెడ్యూల్ 9లో ఉన్న 89 సంస్థలు, షెడ్యూల్ 10లో ఉన్న142 సంస్థల విభజన నేటికీ ఇంకా పూర్తి కానే లేదు. వేల కోట్ల విలువైన ఆస్తుల పంపకాలు ఇంకా జరగనే లేదు. షెడ్యూల్ 9లోని సంస్థల విభజన గురించి షీలాబిడే కమిటీ నివేదిక ఇచ్చినా, ఏపీ ప్రభుత్వం దానిని అమలుచేయాలని ఉత్తర్వులిచ్చినా తెలంగాణ ప్రభుత్వం స్పందించలేదు. ఒక్క విద్యుత్ బకాయిలే వేలకోట్లు రావాల్సి ఉంది. నాయకులు తమ అవసరాలు, స్వార్థ రాజకీయ ప్రయోజనాలతో అన్నీ అటకెక్కిపోయి ఉన్నాయి. ఇంత దురదృష్టం దేశంలో ఏ రాష్ట్రానికీ లేదంటే అతిశయోక్తి కాదు.

ఏదేమైనా, ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన ఆ నగరంతో, ఏళ్ళతరబడి అనుబంధం ఉన్న హైదరాబాదుతో మనకున్న అనుబంధం తెగిపోవడమన్నది బాధాకరమే!.. కానీ, తప్పదు. కొత్త రాజధాని వస్తే తప్ప ఆ ఆవేదన తీరదు!.. దేశంలో అనేక వెనుకబడివున్న రాష్ట్రాలు క్రమేణా ప్రగతిపథంలో పరుగులు తీస్తుంటే, అసంబద్ధమైన ఆలోచనా విధానాలతో, అస్తవ్యస్తమైన పాలనతో మన రాష్ట్రం అన్ని విధాలా వెనుకబడిపోతున్నా, అన్నపూర్ణ ఆంధ్రగా ఘనత కెక్కిన ఆంధ్ర.. అనాదాంధ్రగా పేరుబడి అపఖ్యాతి పాలవుతున్నా మన నాయకుల్లో చలనం ఉండకపోవడం దారుణం. వీటన్నిటికీ చేతులారా చేసుకుంటున్న మన తప్పిదాలే కారణం. దాదాపు పదేళ్ళుగా ప్రజల ప్రయోజనాలను పట్టించుకోకుండా సాగిన అస్తవ్యస్త పాలనతో రాష్ట్రానికి కలిగిన కష్టం, జరిగిన నష్టం అంతాఇంతా కాదు. అయినా, జరిగిపోయిన చేదు గతాన్ని తిట్టుకుని ఏం ప్రయోజనం?.. రాష్ట్రానికి తలమానికం వంటి రాజధాని విషయంలో ఇకనైనా ప్రజల ఆశలు ఆకాంక్షలకు తగ్గట్టుగా మన నాయకులు గట్టి నిర్ణయాలు తీసుకుంటారని ఆశిద్దాం!..

---

కూటమి విజయంతో..

## బీజేపీలో ఆనందోత్సాహాలు



దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో బీజేపీలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల 4న నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. బాణసంచా వేడుకలతో కార్యాలయ ప్రాంగణం మార్మోగింది. కార్యకర్తలు, నాయకులు కేకు కట్ చేసి అందరికీ పంచారు. ఈ ఎన్నికల్లో ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని వంశీధర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో ప్రజల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి పథకాలు చేపట్టిందని, అందువల్లనే ప్రజలు బీజేపీని బాగా ఆదరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో వైకాపా అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, కొత్త ప్రభుత్వం ప్రజల పక్షాన నిలిచి ప్రజల కోసం పనిచేస్తుందని ఆయన అన్నారు.

## ఎన్‌డీసీసీబీ ఛైర్మెన్ పదవికి.. కామిరెడ్డి రాజీనామా



నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మెన్ పదవికి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఈనెల 4న రాజీనామా చేశారు. ఆమేరకు తన రాజీనామా పత్రాన్ని బ్యాంకు సీఈఓ శ్రీనివాసరావుకు పంపించారు. సూళ్ళూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్యకు ముఖ్య అనుచరుడైన కామిరెడ్డిని 2012లో వైకాపా ప్రభుత్వం డీసీసీబీ ఛైర్మెన్ పదవిలో నియమించింది. ఆరుగురు సభ్యులతో పాలకవర్గాన్ని ఏర్పాటుచేసింది. పాలకవర్గ పదవీకాలాన్ని ఆరునెలల వంతున పొడిగిస్తూ వచ్చింది కూడా. ఆ మేరకు కామిరెడ్డి పదవీకాలం వచ్చే నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో వైకాపా ఓటమి పాలుకావడంతో మనస్తాపంచెంది ఆయన రాజీనామా చేసినట్లు సమాచారం.

## ఇండియా కూటమికి ఇది శుభపరిణామం - కే.రాజు

దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల ప్రక్రియలో ఇండియా కూటమి 235 స్థానాలు కైవసం చేసుకోవడం శుభ పరిణామమని నెల్లూరు ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కొప్పుల రాజు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన అనంతరం ఆయన నెల్లూరులోని ఇందిరా కాంగ్రెస్ భవన్ నుంచి ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేకించి తాను పోటీచేసిన నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గంలో 54 వేలకు పైగా ఓట్లు సాధించడం సంతోషంగా ఉందని, ఓటు వేసిన ప్రతి ఒక్కరికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొంటూ, డీసీసీ నేత చేవూరు దేవకుమార్‌రెడ్డికి, కమిటీ వారికి ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ ఎన్ని కుయుక్తులు పన్నినా, అనేక రాష్ట్రాల్లో ప్రజలు బీజేపీ కుట్రలను తిప్పికొట్టారని, గతంలో కంటే కాంగ్రెస్ పార్టీ ఎంతో పుంజుకుందని, అన్ని అసెంబ్లీ మరియు పార్లమెంటు స్థానాల్లో గట్టి పోటీ ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన దళిత మైనారిటీ మహిళ హక్కుల సాధనకై నిరంతరం కృషి చేస్తుందని, నిస్వార్థ రాజకీయ నాయకుడు, పేదల పక్షపాతి రాహుల్ గాంధీ పోటీ చేసిన రెండు నియోజకవర్గాల్లో అద్భుత మెజారిటీ సాధించారని, ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో దేశానికి చుక్కాని వలే పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాసులరెడ్డి, ఫయాజ్, తిరుపయ్య, మోహన్, మీడియా ఇంచార్జ్ కే.సంజయ్ కుమార్, సుధీర్, బాషా తదితరులు పాల్గొన్నారు



## అల్లూరులో వైభవంగా..హనుమజ్జయంతి వేడుకలు



హనుమజ్జయంతి వేడుకల్లో భాగంగా మండల కేంద్రమైన అల్లూరుపేటలోని మారుతి ఆశ్రమంలో వెలసివున్న శ్రీ ఆంజనేయస్వామికి ఈనెల 3న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కిదాంబి సంపత్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నశాంతి కార్యక్రమాన్ని కర్నూలు వాస్తవ్యులు బండి శ్రీనివాసులురెడ్డి దంపతులు, సాయంత్రం అన్నప్రసాద వితరణను దేవిరెడ్డి దశరథరామిరెడ్డి దంపతులు నిర్వహించారు. అనంతరం, రాత్రి శ్రీ ఆంజనేయస్వామికి అల్లూరు పురవీధుల్లో వైభవంగా నిర్వహించిన ఊరేగింపులో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16 THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 1 07.6.2024, శుక్రవారం వెల : రూ. 5/-
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• వైనాట్ 175

## కల చెదిరింది



వైనాట్ 175...? ఇదే ఎన్నికల నినాదంతో ఈ ఎన్నికలలో వైసీపీ ప్రజల ముందుకు వచ్చింది. ఓడిపోతా మేమో అన్న ఆలోచన ఆ పార్టీ నేతల్లో ఏ కోశానా కనపడ లేదు. జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేరుతో, ఆయన ఫోటోతో ఎన్నికల్లో విజయం సాధించారు. ఆయన ఫోటో పక్కనే తన ఫోటో పెట్టుకునేలా పరిపాలన సాగిస్తానని ఊదరగొట్టారు. అయితే ఈసారి ఆయన తన ప్రచారంలో ఎక్కడా తమ నాన్న పేరు కానీ, ఫోటోల ప్రస్తావన కానీ తేలేదు. తన సొంత ఇమేజ్‌తో ఎన్నికలకు వెళ్ళారు. మీ కుటుంబంలో మంచి జరిగి ఉంటేనే నాకు ఓటేయండి... అంటూ ప్రతి చోటా చెప్పారు. చరిత్రలో ఇప్పటి వరకూ ఏ రాజకీయ నాయకుడూ ఇలాంటి అభ్యర్ధన చేయలేదు.

అయితే జగన్ ధైర్యంగా చేయగలిగాడంటే 14లో

• ఆబ్కీబార్ 400 పార్

## కథ మారింది



"ఆబ్కీబార్, 400 పార్" అంటే... 'ఈసారి ఎన్నికలలో 400 సీట్లు దాటాలి' అన్న నినాదంతో ఈ ఎన్నికలలో ఎన్డీయే కూటమి కొత్త కథను రాద్దామనుకుంది. ఆ కథ గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విజయగాథ కావాలని భావించింది. ఎగ్జిట్ పోల్స్ సైతం మూడోసారి బీజేపీకి తిరుగులేదని ఢంకా భజాయించి చెప్పాయి. అయితే, ఎన్నికలకు ముందు బీజేపీ దయతలచినట్లుగా రెండు ప్రధాన పార్టీలను ఎన్డీయేలోకి ఆహ్వానించింది. ఓవైపు రామాలయం నిర్మాణం, మరోవైపు 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్ లాంటి విషయాల వల్ల తమకింక తిరుగులేదని, తమ కథ సూపర్‌హిట్‌గా నిలుస్తుందని, ప్రజాక్షేత్రంలో తమ పార్టీ మంచి ఓట్ల కలెక్షన్ సాధిస్తుందని ఎన్డీఏ భావించింది.

సాధారణంగా ప్రస్తుతం ఎన్డీయే ఉన్న 14లో

## లాయర్ @ 43
## నమ్మకానికి నలభైమూడేళ్లు

లాయర్‌లో ఏదైనా వార్త వస్తే
అది నిజం,
అని పాఠకులు నమ్మసాగి....
నలభై మూడేళ్లయ్యింది.

లాయర్ ఏదైనా విషయాన్ని విశ్లేషిస్తే
అది సమర్థనీయం,
అని విశ్లేషకులు సమర్థించ సాగి....
నలభైమూడేళ్లయ్యింది.

లాయర్ ఏ పక్షాన వాదిస్తే
అదే న్యాయం,
అని మేధావులు భావించసాగి....
నలభైమూడేళ్లయ్యింది.

ఏదైనా ప్రత్యేక సంచిక ప్రచురించాలంటే
అది ఒక్క లాయర్‌కే సాధ్యం అని
సాహిత్యాభిమానులు కీర్తించసాగి....
నలభైమూడేళ్లయ్యింది.

నిఖార్సయిన వార్తలకి, నిష్పక్షపాత వ్యాఖ్యలకి
నిజమైన వేదికగా మన లాయర్‌ని
విమర్శకులు ఆదరించసాగి....
నలభైమూడేళ్లయ్యింది.

స్థానిక వార్తల సారథి, సంక్షిప్త సమాచార వారధి
అంటూ... ప్రపంచవ్యాప్తంగా వున్న నెల్లూరీయులు
మన లాయర్‌ని అభిమానించసాగి...
నలభైమూడేళ్లయ్యింది.

సమోన్నత ఆశయంతో, మహోన్నత లక్ష్యంతో,
ఒక ఉద్యమ స్ఫూర్తితో కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
లాయర్ పత్రికని స్థాపించి
నలభైమూడేళ్లయ్యింది.

జూన్ 5, 2024న నలభై నాలుగవ
వసంతంలో అడుగుపెట్టింది మన లాయర్.

ఇన్నాళ్లుగా, ఇన్నేళ్ళుగా మన లాయర్‌ని
ఆదరించి, అభిమానించి అక్కున చేర్చుకుని
ఆశీర్వదిస్తున్న పాఠక దేవుళ్ళకి, ఆప్తులకి,
ఆత్మీయులకి, ప్రకటన కర్తలకి శిరస్సువంచి
నమస్కరిస్తూ...

వ్యవస్థాపకుని స్ఫూర్తితో,
ఆయన బోధించిన సూక్తులు స్మరిస్తూ,
ఆయన నేర్పిన విలువలు పాటిస్తూ,
ఆయన చూపిన బాటలో నడుస్తూ,
ఆయన కలల సాధన కోసం తపిస్తూ,
ఆయన దివ్య ఆశీస్సులతో తరిస్తూ...
అక్షర సమరం కోసం పునరంకితమవుతున్నాం...!

తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)




▶ జిల్లాకి మంత్రులెవరు?



## కేంద్ర మంత్రిగా విపిఆర్..?

## రాష్ట్రంలో.. రేస్‌లో నారాయణ, సోమిరెడ్డి, రామనారాయణరెడ్డి?

11లో







లాయర్
జూన్ 07, 2024

# వడదెబ్బకు ఆవిరవుతున్న ప్రాణాలు

దేశంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఎండలు మండిపోతుండడంతో వేసవి వడగాడ్పులు మరింతగా విజృంభిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రతలు పెరిగి పెరిగి చివరికి మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని పదేపదే శాస్త్రవేత్తలు మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో, ఎండలు తమ ప్రతాపం చూపుతున్నాయి. మండేఎండల ప్రభావంతో గుండెలు కూడా ఆగిపోతున్నాయని, గుండె సంబంధిత వ్యాధులు ప్రాణాలు తీస్తున్నాయని, తాజాగా ఇటీవలి కాలంలోనే దేశంలో ఆరు వందల మందికి పైగానే అలా మృత్యువాత పడ్డారని ఆరోగ్యశాఖ గణాంకాలే చెప్తున్నాయి. అంతేకాదు, వడగాడ్పుల తీవ్రత పెరిగి వేలాదిమంది ఆసుపత్రుల పాలవుతున్నారని, ఒక్క మధ్యప్రదేశ్‌లోనే ఇటీవల 5వేలకు పైగా వడగాడ్పుల కేసులు నమోదయ్యాయని, రాజస్థాన్‌లో 4వేలకుపైగా, ఆంధ్రప్రదేశ్‌లో కనీసం రెండువేల మందికి పైగానే వడదెబ్బ తగిలి అల్లాడుతున్నారని, వడదెబ్బకు తట్టుకోలేక తాజాగా దేశంలో 80 మందికి పైగానే మరణించారని వైద్యవర్గాల అంచనా. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ వడదెబ్బ మృతులు క్రమేణా పెరిగిపోతుండడం గమనార్హం. రుతుపవనాలు వస్తున్నా, అక్కడక్కడా వానలు కురుస్తున్నా దేశంలోని అనేకరాష్ట్రాలు నిప్పులగుండాల్లా ఉన్నాయి. చల్లని వాతావరణం కరువై, భానుడి భగభగలకు తట్టుకోలేక ఇంకా వేలాదిమంది ప్రజలు అవస్థలు పడుతూనే ఉన్నారు. కర్బన ఉద్గారాల ద్వారా కాలుష్యం పెరిగిపోవడం, భూతాపం అంతకంతకూ పెరుగుతూ ఉష్ణోగ్రతలు భూగోళాన్ని కకావికలు చేస్తుండడం చూస్తూనే ఉన్నాం. భూగోళం కాస్తా..రానురాను ఎండ వేడి తప్ప ఇంకేదీ ఉండని అగ్నిగోళంగా తయారవుతోంది. ప్రకృతిని పరిరక్షించుకోకపోవడంతో రుతువులు సైతం మారిపోయి, చల్లని కాలాలు కూడా సెగలు కక్కుతూ వేడిగాలులతో నిండిపోతున్నాయి. దేశంలోని అనేక రాష్ట్రాల్లో గతంలో కంటే ఎండలు ముదిరిపోయి ప్రజలు ఊహించలేనంతగా అదొక విపత్తుగా మారిపోతోంది. జనాభా పెరిగిపోయి నగరాలు కాంక్రీటు జంగిల్లుగా మారిపోతున్న నేటి పరిస్థితుల్లో పచ్చదనాన్ని కాపాడుకునే పరిస్థితే ఉండడం లేదు. నేటి ఆధునిక కాలంలో నగరీకరణ, పట్టణీకరణ పెరిగిపోవడంతో నగరాల్లో సైతం మరింత వేడి పెరిగిపోతోందని ఇటీవల భువనేశ్వర్ ఐఐటి వారి మరో తాజా పరిశోధనల్లో తేలింది. దాదాపు 141 నగరాల్లో స్థితిగతులను 2003 నుంచి 2020 వరకూ అధ్యయనం చేసి ఇటీవలే ఆ సంస్థ వారు సర్వే నివేదికలు రూపొందించారు. నగరాలు, పట్టణాల్లో జనాభా విపరీతంగా పెరుగుతుండడం వల్ల భూ వినియోగంలో మార్పులు వచ్చి, దాదాపు 60 శాతం వేడిమికి కారణమవుతున్నాయంటూ నిర్ధారించారు. ఇరుకైన స్థలాల్లో నివాసాలు ఏర్పరచుకుని, చెట్టుచేమలనేవి లేకుండా ఉండడం, ఉన్న చెట్లను నరికేసి నివాసాలు కట్టుకోవడం, మనిషికి ప్రాణప్రదమైన పచ్చదనాన్నే విస్మరిస్తుండడంతో ఈ నగరీకరణల వల్ల పెద్ద ముప్పు వాటిల్లుతోందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఇకనైనా పాలకులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకొని, అలాంటి విపత్తులు ఇంకా మండిపోకముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు హితవు చెప్తున్నారు. ఉష్ణోగ్రతలు భరించరానివిగా ఉంటున్న ప్రాంతాలను వెంటనే గుర్తించి అక్కడంతా పచ్చదనం నిండిపోయే విధంగా మొక్కలు నాటి సంరక్షించుకోవడం వల్ల ఈ ముప్పు నుంచి క్రమేణా బయటపడేందుకు అవకాశం ఉంటుందని కూడా నిపుణులు సూచిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని నాయకులు, అధికారులు, ప్రజలు అంతా కలసి ఎక్కడ వీలుంటే అక్కడంతా మొక్కలు నాటి తప్పనిసరిగా వాటిని పర్యవేక్షించేందుకు తగ్గ వ్యవస్థలు ఏర్పాటుకాకుంటే ప్రమాదం తప్పదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఎండలు మండిపోవడం వల్ల వడగాడ్పుల వంటి ప్రాణాంతక ప్రమాదాలతో పాటు, భూమి ఎండిపోయి జలవనరులు అడుగంటిపోయి, పొలాలెండిపోయి ఆహార సంక్షోభం ఏర్పడి, పోషకాహారం దొరక్క ప్రజలు అవస్థలు పడడం జరుగుతుంది. ఇలా ఒకదాని వెంబడి మరో విపత్తు వచ్చిపడతాయని వేరే చెప్పనక్కర లేదు. ఈ భారీ ఉష్ణోగ్రతలను తగ్గించుకోవడానికి చేయాల్సిన కృషినంతా చేయాలి. ముఖ్యంగా మనదేశం ప్రకృతి పరిరక్షణకు మరింత చొరవ తీసుకోవాలి. ప్రజలను ఈ వడగాడ్పుల మరణాల నుంచి కాపాడేందుకు ప్రభుత్వాలు చర్యలుచేపట్టాలి. వడదెబ్బ మృతుల కుటుంబాలను ఆదుకోవాలి. ఆసుపత్రుల్లోని బాధితులకు ఉదారంగా సాయం అందించాలి. అన్నిచోట్ల పచ్చదనం పెంపొందించేందుకు తక్షణ కార్యాచరణ చేపట్టాలి. ప్రభుత్వాలే కాదు, ప్రజలు కూడా అందుకు వెంటనే నడుం బిగించాలి.

# అతీగతీ లేని గండిపాళెం ప్రాజెక్టు!

జిల్లాలోని ఉదయగిరి, వరికుంటపాడు వంటి మెట్ట ప్రాంతాలు నేటికీ సాగునీళ్ళు దొరక పొలాలన్నీ బీళ్ళు పడిపోతున్నాయి. ఈ పరిస్థితి ఇప్పటిది కాదు. ఎంతోకాలం నుంచి ఉంది. దాదాపు 50 ఏళ్ళ క్రితం నిర్మించారు కానీ, కొద్ది సంవత్సరాలు నీళ్ళతో కళకళలాడిన ఈ రిజర్వాయర్ కాలక్రమంలో ఎండుమొఖం పట్టింది. రిజర్వాయర్‌కు సంబంధించిన ప్రధాన కాలువలు పాడైపోయాయి. వీటిని బాగు చేస్తామని, ఈ ప్రాంత ప్రజలకు నీటికరువు లేకుండా చూస్తామని నాయకులు ఊక దంపుడు ఉపన్యాసాల్లో చెప్తున్నారే తప్ప, వాస్తవానికి దాని బాగుకు ఎవరూ ఏమీ చేయడం లేదు. దీంతో, ఎంతోకాలంగా ఈ రెండు మండలాల్లోని రైతులు సాగు నీటి కోసం పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. పక్కనే గండిపాళెం రిజర్వాయర్ ఉందని సంతోషమే కానీ, అదెప్పుడూ ఎండిపోయే ఉండడం బాధాకరం. వేలాది ఎకరాల పంటపొలాలు ఆ చుట్టపక్కలే ఉన్నా, పొలాలు నీళ్ళులేక బావురుమంటున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్ ఎండిపోయి ముళ్ళచెట్లు మొలిచి చూసేందుకే దయనీయంగా ఉంది. అతీగతీ లేకుండా పడివున్న ఈ రిజర్వాయర్‌కు మోక్షం ఎప్పుడో తెలియడం లేదు. రిజర్వాయర్ ఆధునీకరణ పనులు పూర్తిస్థాయిలో చేసిందేమీ లేదు. ఇంత దయనీయంగా ఉన్నా జిల్లా ఉన్న తాధికారులు పట్టించుకోకపోవడం దారుణం.

జె.ఎల్ నరసయ్య, అనంతసాగరం.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# అనూహ్య ఫలితాలు

అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఈసారి ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. దేశంలో బీజేపీ హవా బాగుందని అనుకుంటున్నా, ఆ పార్టీకి గణనీయంగా స్థానాలు తగ్గిపోతాయని ఎవరూ ఊహించలేదు. అదేవిధంగా రాష్ట్రంలో మరో 30 ఏళ్ళు వైకాపా ప్రభుత్వమే ఉంటుందని అనుకున్నాం కానీ, మరీ ఇంత దారుణంగా ఓడిపోతుందని ఊహించనే లేదు. మన జిల్లాలో కూడా ఫలితాలు తిరగబడి, అన్నిస్థానాల్లోనూ కూటమి విజయం సాధించడం విచిత్రమే మరి! బండ్లు ఓడలవుతాయి, ఓడలు బండ్లవుతాయన్న సామెతగా, ఈ రాజకీయాల్లో ఎప్పుడు ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఊహించడమే కష్టంగా ఉంది. అయినా, ఎవరు గెలిచినా సామాన్యులకు పెద్దగా ఒరిగేదేమీ లేదు కానీ, ధరలు పెరగకుండా, తినడానికి తిండికి ఇబ్బంది లేకుండా చూడగలిగితే అదే పదివేలు. పండ్లు, కూరగాయల ధరలు, నిత్యావసరాల ధరలు, చివరికి ఆకుకూరల ధరలు కూడా పెరిగిపోయి, కాస్తో కూస్తో సంపాదించుకుంటున్న రోజువారీ కూలిడబ్బులు ఏమూలకూ చాలక ఇబ్బందులు పడుతున్న పేదప్రజలను ఆదుకునేందుకు ముందుగా ధరలను తగ్గిస్తే అంతకన్నా సంతోషం ఇంకేముంటుంది?..

జె.ఎస్ శంకరయ్య, పొదలకూరు.




# ఏమైపోతున్నాం... ఎటు వైపు పయనిస్తున్నాం?

అతి పురాతన కాలం నుండి, సనాతన ధర్మానికి, సంస్కృతీ సంప్రదాయాలకి, కట్టు, బొట్టు, కట్టుబాటుతో పాటు నైతిక విలువలకి, శాంతి సామరస్యతలకి ప్రఖ్యాతి చెందిన పుణ్యభూమి, ధన్యభూమి మన భారతదేశం. బలమైన కుటుంబ వ్యవస్థకి, ఆదర్శనీయమైన ఆచారాలకి ప్రతీక మన భరతమాత. శాంతియుత పోరాటాల ద్వారా, అహింస మహాపాపం అన్న నినాదంతో, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాలతో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న ఘనత మన భారతీయులది.

అలాంటి మనం ఇప్పుడు ఎటువైపు వెళ్తున్నాం...? భావి తరాలకి ఏం సందేశం ఇస్తున్నాం....?? అని మనల్ని మనం ప్రశ్నించుకునే సమయం ఆసన్నమైంది. మన ఇల్లు మనమే చక్కదిద్దుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

మన ఉనికిని మనం చాటుకోవడానికి సుదీర్ఘకాలం చేసిన పోరాటంలో ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి విజయం సాధించాం. అయోధ్యలో 500 సంవత్సరాల తరువాత రామమందిరాన్ని నిర్మించుకోగలిగాం. మన బాలరాముడిని మనం మళ్ళీ ఆయన సొంతింట్లో ప్రతిష్టించుకోగలిగాం. హిందుస్థాన్ అంటే హిందువుల మనోగతాన్ని గౌరవించే దేశం అని గర్వంగా చెప్పుకోగలిగే అర్హతని సాధించాం.

సాంకేతిక పరిజ్ఞానం వేలం వెర్రెత్తుతోంది. అభం శుభం తెలియని మూడేళ్ళ చిన్నారులు సైతం అంతర్జాలానికి బానిసలవుతున్నారు. సామాజిక మాధ్యమాల ఊబిలో చిక్కుకుని యుక్త వయస్సు వచ్చేటప్పటికి నేర సామ్రాజ్యం పట్ల ఆకర్షితులవుతున్నారు. అలాంటి యువతరాన్ని దారి మళ్లించి సన్మార్గం వైపు నడిపించాల్సిన తరుణం ఆసన్నమయ్యింది. కనుమరుగై, తెరమరుగైపోతున్న మన సంస్కృతులకి, సంప్రదాయాలకి, ఆచారాలకి, నైతిక విలువలకి, అహింసావాదానికి, ఆధ్యాత్మిక తత్వానికి జీవం పోసి వాటిని మళ్ళీ వెలుగులోకి తెచ్చి, వాటికి పూర్వవైభవం తేవలసిన బాధ్యత మన తరంపై ఉంది. మన తరం అంతరించిపోతే మన ఆచారాల ఆనవాళ్ళు కూడా మిగలవు. ఇకనైనా మనం మేలుకోవాలి. నేటి తరాన్ని జాగృతం చేసి రేపటి తరాలకు వారధులుగా తీర్చిదిద్దాలి.

'కలి' రాజ్యమేలుతున్న ఈ కలియుగంలో మంచితనం, మానవత్వం, మనిషి తత్వం గురించి భవిష్యత్ తరాలకి వివరించాలి. హింస, అధర్మం, అక్రమాలతో అధోగతి పాలవుతున్న సమాజాన్ని దుర్మార్గులు, సంఘవిద్రోహుల బారి నుండి రక్షించే విధంగా యువతని చైతన్యవంతం చేయాలి. అహింస పరమార్థాన్ని బోధించాలి. కుటుంబ విలువలగురించి అవగాహన కల్పించాలి. నీతి, నిజాయతి, నైతిక విలువలయొక్క ప్రాముఖ్యత, ప్రాధాన్యత గూర్చి తెలియచేయాలి. బాల్యం నుండే సమాజసేవ, సామాజిక బాధ్యత వంటి విషయాల పట్ల ఆసక్తి కలిగేలా స్ఫూర్తిని కలిగించాలి. విలాసాలు, వినోదాల మోజులోపడి చెడు వ్యసనాలతో, పాడు స్నేహాలతో తమ బంగారు భవిష్యత్తును నేరమయం చేసుకుంటున్న యువ సమాజాన్ని మేలుకొలపాలి.

విద్యార్థి దశ నుండే 'నేరం అన్నది ఎంత ఘోరమో' అన్న ఆలోచన రేకెత్తించాలి. నేరము - శిక్ష అన్న అంశంతో పాఠాలని రూపొందించి తరగతులలో బోధించాలి. ఆ బాధ్యత ఇప్పుడు మేధావులు, విద్యావంతులు, ప్రజాపాలకులు తమ భుజస్కంధాలపైకి తీసుకోవాలి.

ఒక నేరం జరిగితే కేవలం ఆ నేరం చేసిన వ్యక్తి ఒక్కరే శిక్ష అనుభవిస్తున్నా ననుకుంటే అది అతని పొరపాటే. ఒక వ్యక్తి నేరానికి పాల్పడితే ఆ మచ్చ ఆ కుటుంబానికంతా ఉంటుంది. ఒక నేరస్తుడికి శిక్షపడితే దాని ఫలితం ఆ వ్యక్తిని కన్న అమ్మా నాన్నలను, తోడబుట్టిన వారిని, కట్టుకున్న భార్యని / భర్తని కన్న బిడ్డలని మొత్తం ఆ కుటుంబాన్నంతా మానసిక క్షోభకి గురిచేస్తుంది. ఆ నేరస్తుడి కుటుంబం మొత్తం సంఘంలో అభాసుపాలై తలదించుకోవలసి వస్తుంది. ప్రత్యక్షంగా ఆ నేరస్తుడికి చట్టం శిక్ష విధిస్తే, పరోక్షంగా సభ్య సమాజం ఆ కుటుంబాన్ని వెలి వేస్తుంది. పిల్లి కళ్ళు మూసుకుని పాలుతాగుతున్నట్లుగా తనని ఎవరూ చూడడం లేదులే అని నేరం చేసేస్తే... అది ఎప్పుడో ఒకప్పుడు బయటపడక తప్పదు. తప్పు చేసిన వారు ఎవరైనా ఎంతటి వారైనా ఎప్పటికైనా దొరికిపోవలసిందే.

నేరాలు చేసి జైళ్లపాలైన వారు పశ్చాత్తాపపడేలా కారాగారంలో వారికి హితబోధ చేసి కనువిప్పు కలిగించి, మళ్ళీ తప్పుచేయకుండా ఉండేలా నేరస్థులని మారుస్తున్నామని మనం చంకలు గుద్దుకుంటున్నాం.

'అడుసు తొక్కనేల కాలు కడుగనేల' అని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. అసలు నేరాలే జరగకుండా ఉండేలా సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలి. నేరం చేసినవారు దాని పర్యవసానం అనుభవించే శిక్షల గురించి అవగాహన కల్పించాలి. జైలు జీవితం ఎంత భయానకంగా ఉంటుందో వివరించాలి. పొగ త్రాగడం, మద్యం సేవించడం ఆరోగ్యానికి ప్రమాదకరమని ప్రభుత్వాలు ఎలా ప్రచారం చేస్తున్నాయో, నేరము - శిక్ష గురించి కూడా అలాంటి ప్రచారాన్ని చేపట్టి, వాటి పట్ల యువతకి అవగాహన కల్పించడం ద్వారా సమాజాన్ని చైతన్యపరచి నేరాలను అరికట్టాలి.

నేరాలు అరికట్టే విషయమై ప్రభుత్వాలు ప్రత్యేకశ్రద్ధ పెడితే తప్పకుండా మంచి ఫలితాలను సాధించవచ్చు. వివిధ శాఖలలో పదవీ విరమణ చేసిన మేధావులను ఎంపికచేసి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో, జిల్లాలలో 'శాంతి' కమిటీలను ఏర్పాటు చేసి నేరరహిత భారత్ ధ్యేయంగా పనిచేస్తే తప్పక శాంతి స్థాపన జరుగుతుంది..!

- రాజశ్రీ

## టీడీపీకే నెల్లూరీయుల అండ

# జిల్లా నిండా.. దేశం జెండా!



**వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి**
నెల్లూరు పార్లమెంటు
మెజారిటీ: 2,45,902



**పొంగూరు నారాయణ**
నెల్లూరు నగరం
మెజారిటీ: 72,489

ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే నాలుగు దశాబ్దాల విరామం తరువాత పాత కొత్త నెల్లూరు జిల్లాలోని మొత్తం సీట్లన్నీ తెలుగుదేశం పార్టీ ఖాతాలో పడిపోయాయి. వైసీపీ కంచుకోటలా ఉన్న నెల్లూరు జిల్లా మొత్తం ప్రజల అండతో తెలుగుదేశం జెండా ఎగిరింది.



**వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**
కోవూరు
మెజారిటీ: 54,583



**కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**
నెల్లూరు రూరల్
మెజారిటీ: 34,480



**దగుమాటి వెంకటకృష్ణారెడ్డి**
కావలి
మెజారిటీ: 30,948



**ఇంటూరి నాగేశ్వరరావు**
కందుకూరు
మెజారిటీ: 18,558

## పాత కొత్తల కలయిక!

నెల్లూరు నగరం, రూరల్, సర్వేపల్లి, ఆత్మకూరు, గూడురు, వెంకటగిరి నియోజకవర్గాలలో పాత కాపులైన నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణలకే ఓటర్లు పట్టం కట్టారు.

అయితే ఈసారి కోవూరు నుండి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి నుండి దగుమాటి కృష్ణారెడ్డి, ఉదయగిరి నుండి కాకర్ల సురేష్, కందుకూరు నుండి ఇంటూరి నాగేశ్వరరావు, సూళ్లూరుపేట నుండి నెలవల విజయశ్రీలు కొత్త అభ్యర్థులుగా తొలిసారిగా శాసనసభలో అడుగుపెట్టబోతున్నారు.

నారాయణ కూడా ప్రజాక్షేత్రంలో గెలిచి తొలిసారిగా శాసనసభకు వెళ్తున్నప్పటికీ 2014-19 కాలంలో శాసనమండలి సభ్యుడిగా మంత్రి హోదాలో అసెంబ్లీ మెట్లెక్కి వున్నారు.

మొత్తానికి ఈ ఎన్నికలు రాష్ట్రం మొత్తం మీద పెను సంచలనాన్ని సృష్టిస్తే.. ఆ పరంపరలో నెల్లూరుజిల్లా ప్రత్యేక స్థానాన్ని సంతరించుకుంది.



**సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**
సర్వేపల్లి
మెజారిటీ: 16,288



**కాకర్ల సురేష్**
ఉదయగిరి
మెజారిటీ: 9,621



**ఆనం రామనారాయణరెడ్డి**
ఆత్మకూరు
మెజారిటీ: 7,576



**నెలవల విజయశ్రీ**
సూళ్ళూరుపేట
మెజారిటీ: 29,115




**పాశం సునీల్‌కుమార్**
గూడూరు
మెజారిటీ: 21,192



**కురుగొండ్ల రామకృష్ణ**
వెంకటగిరి
మెజారిటీ: 16,294





# 30 ఏళ్ళ తర్వాత..
# నెల్లూరు నగరం టీడీపీ కైవసం

- 72,489 ఓట్ల మెజార్టీతో నారాయణ విజయకేతనం
- కలిసొచ్చిన 'అభివృద్ధి మంత్రం'

అందరూ అనుకున్నట్లే నెల్లూరులో నారాయణ గెలిచారు. మంత్రిగా ఉన్నప్పుడు నారాయణ నెల్లూరు నగరానికి చేసిన అనేక అభివృద్ధి పనులే ఆయన్ను గెలిపించాయి. 1983లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి, 1994లో తాళ్ళపాక రమేష్‌రెడ్డి నెల్లూరు నియోజకవర్గం నుండి విజయం సాధించారు. 30ఏళ్ళ సుదీర్ఘకాలం తర్వాత మళ్ళీ నెల్లూరు నగర నియోజకవర్గంలో నారాయణ గెలుపుతో తెలుగుదేశం జెండా ఎగరేసినట్లయింది. ఈ ఎన్నికల్లో నగర నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ 72,489 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి షేక్ ఖలీల్ అహ్మద్‌పై... పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నుంచి ప్రతీ రౌండ్‌లోనూ నారాయణ ముందంజలో ఉన్నారు. నెల్లూరులో నారాయణ గెలవడం, జిల్లాలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల ఆనందానికి అవధులు లేవు.

1998లో రాజకీయ ఆరంగేట్రం చేసిన డాక్టర్ పొంగూరు నారాయణకు 1998లో టీడీపీ అధినేత నారా చంద్రబాబుతో పరిచయం రాజకీయాల వైపు తిప్పింది. తొలుత, టీడీపీ సర్వే విభాగానికి తన మేధోశక్తిని వినియోగించిన నారాయణ క్రమంగా క్రియాశీల రాజకీయాల వైపు అడుగులు వేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్ష పాత్రకే పరిమితమై, టీడీపీ వెన్నంటి ఉండి ఆయన చేసిన సేవలు అమోఘం. కష్టకాలంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలవడంతో పాటు ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడే నారాయణ తపన, పట్టుదల చూసి ఆయన్ని చంద్రబాబు కూడా ఎంతగానో మెచ్చుకుని ప్రోత్సహించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు తన మంత్రివర్గంలో డాక్టర్ నారాయణకు స్థానం కల్పించారు. కొత్త రాష్ట్రం అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడంలో కూడా నారాయణకు భాగస్వామ్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖలతో పాటు నూతన రాజధాని అమరావతి నిర్మాణంలోనూ నారాయణ కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో నారాయణ విజయం నగర ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఆనందోత్సాహాలను కలుగజేసింది.

## నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

2024 సార్వత్రిక ఎన్నికల్లో తనపై నమ్మకంతో ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని డాక్టర్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. ఈనెల 4న ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం డిక్లరేషన్ ఫారం అందుకున్న ఆయన, కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కాలేజీ వద్ద విలేకర్లతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో... 72,489 ఓట్లతో తాను విజయం సాధించడం జరిగిందన్నారు. మొత్తం ఓట్లు 2లక్షలా 39వేలని, అందులో లక్షా 72వేల ఓట్లు పోల్ అయ్యాయన్నారు. అంటే 42 శాతం ఓటింగ్ పోలైందని. నెల్లూరు సిటీ చరిత్రలో ఇంత భారీ విజయాన్ని తనకు అందించిన నెల్లూరు ప్రజలందరికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరుసిటీలోని సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. అదే విధంగా 2014 నుంచి 2019 వరకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని... కొన్ని మిగిలిపోయాయని... వాటిని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయకుండా వదిలేసిందన్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క వర్క్ కూడా పెండింగ్‌లో లేకుండా పూర్తి చేస్తానన్నారు. జగన్ అరాచక పాలన కారణంగానే... ఈ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు ఓడించారన్నారు. గత ఐదేళ్ళలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. టీడీపీ విజయానికి కార్యకర్తలు ఎంతో శ్రమించారని, అందుకోసమే కార్యకర్తలకుఅండగా ఉండాలన్న ఉద్దేశంతోనే తమ కుటుంబ సభ్యులంతా కలిసి ఏడాదికి వారి సంక్షేమానికి రూ. 10 కోట్ల రూపాయలను ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నామని ఆయన వివరించారు.

# ఏటికి ఎదురీది నిలిచిన..కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

- 3 సార్లు గెలిచి 'హ్యాట్రిక్' సాధించాడు
- 'రూరల్ రూలర్' తానేనని నిరూపించుకున్నాడు



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.. అంటేనే మాస్ లీడర్‌గా పేరు. ప్రత్యేకించి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజలకు ఆయన అభిమాన నాయకుడు. గడప గడపా తిరిగాడు. ఎక్కడ సమస్యలుంటే వాటిని తీర్చడానికి నిరంతరం కృషి చేశాడు. ప్రజా సంక్షేమం కోసం ఎంతగానో పాటుపడ్డాడు. నెల్లూరురూరల్ నియోజకవర్గంలో తిరుగులేని పట్టు సాధించుకున్నాడు. వైకాపాలో ఉన్నప్పుడు నియోజకవర్గానికి అవసరమైన నిధులివ్వడం లేదని అధినాయకత్వం తీరుకు మండిపడ్డాడు. ఆగ్రహంతో ఆ పార్టీకే చెల్లుచీటీ రాశాడు. అధికారంలో ఉన్న వైకాపా ముప్పుతిప్పలు పెడుతున్నా ఏటికి ఎదురీదాడు. ధైర్యంగా తెలుగుదేశంలో చేరాడు. సీటొస్తుందో రాదో అనుకుంటున్న తరుణంలో రూరల్‌లో నువ్వే పోటీలో ఉండాలంది టీడీపీ అధినాయకత్వం. అవతల పోటీలో ఉండేది చిన్న నాయకుడేమీ కాదు.. 'ఆదాల అంటే అదరహో' అనిపించే ఉద్దండ నేత, మాజీమంత్రి..అందులోనూ నెల్లూరు ఎంపీగా ఉంటూ, నెల్లూరు రూరల్ బరిలో దిగిన నాయకుడు. అర్థబలానికి, అంగబలానికి లోటులేని ఆదాలతో పోటీ సామాన్యమైన విషయం కాదనేది అందరికీ తెలిసిందే. దీంతో ఈసారి ఆదాల చేతిలో కోటంరెడ్డి ఓటమి ఖాయం అనుకున్నారంతా. అయినా, ప్రజలు కోటంరెడ్డి పక్షాన్నే నిలిచారు. 'రూరల్ రూలర్' మీరే నంటూ ఆదరించారు. ప్రజలకు శ్రీధర్‌రెడ్డి మీదున్న నమ్మకం.. శ్రీధర్‌రెడ్డికి ప్రజల మీదున్న విశ్వాసం రెండూ ఒక్కటై రూరల్‌లో ఆయనకు అఖండ విజయం చేకూర్చిపెట్టాయి.

## 3 సార్లు నిలిచి గెలిచాడు

నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత వరుసగా 3 సార్లు నిలిచి గెలిచిన నాయకుడెవరైనా ఉన్నారంటే..అది కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డే. జిల్లాలో వరుసగా 3 సార్లు గెలిచి, హ్యాట్రిక్ సాధించిన వారిలో 3వ వ్యక్తి..కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. 1985-89-94 ఎన్నికల్లో కావలి నుంచి కలికి యానాదిరెడ్డి, 1983-85-89లలో కోవూరు నుండి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలకు ఆ ఘనత దక్కింది. తాజాగా ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి.. వైకాపా నాయకుడైన ఆదాల ప్రభాకర్ రెడ్డిపై 34,480 ఓట్ల మెజార్టీతో గెలవడం రూరల్‌లోనే కాదు, జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించింది. 2014 ఎన్నికల్లో తొలిసారిగా రూరల్ నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసిన శ్రీధర్‌రెడ్డి, ప్రత్యర్థి..బీజేపీ అభ్యర్థి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిపై 25,653 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, రెండవసారి 2019 ఎన్నికల్లో వైకాపా నుంచి పోటీచేసి.. తన సమీప ప్రత్యర్థి..టీడీపీ అభ్యర్థి అబ్దుల్ అజీజ్‌పై 20,776 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఈ ఎన్నికల్లో ఆ రెండు ఎన్నికల్లో కంటే ఎక్కువ ఓట్లు రావడం విశేషం. వైకాపా నుంచి బయటకు వచ్చి, వైకాపాకే ఎదురునిలిచి, తెదెపా నుంచి గెలిచి, 3వసారి విజయంతో 'హ్యాట్రిక్' సాధించి జిల్లా రాజకీయాల్లో శ్రీధర్‌రెడ్డి సంచలనం సృష్టించాడు.

# డా. గంగిశెట్టికి సన్మానం



నెల్లూరుకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త, రచయిత డా. గంగిశెట్టి శివకుమార్‌ను ఇటీవల హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. తెలంగాణ సాహితీ పరిషత్ నిర్వహణలో జరిగిన బాలసాహితీ సమ్మేళనంలో ఆయన పాల్గొన్న సందర్భంగా అక్కడి సాహితీ ప్రముఖులు డా.ముంజులూరి కృష్ణకుమారి, డా.జుర్రు చెన్నయ్య, గరిపెల్లి అశోక్ తదితరులు పాల్గొని, నిరంతరం బాలల కథలు, రచనలతో బాలసాహిత్యానికి డా. గంగిశెట్టి చేస్తున్న సేవలను అభినందించి సత్కరించారు.


# గోడౌన్లకు చేరుకున్న ఈవీఎంలు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగియడంతో ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను నెల్లూరు నగరంలోని ఆర్డీఓ కార్యాలయం ఆవరణ నుంచి భద్రంగా గోడౌన్లకు చేర్చారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ పర్యవేక్షణలో, జిల్లాలోని రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో వాటిని గోడౌన్లలో భద్రపరచి సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మల్లోల, ప్రేమ్ కుమార్, పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే ఆధ్వర్యంలో ఇందుకూరుపేట మండలంలోని మైపాడు సముద్ర తీర ప్రాంతంలో చెత్తాచెదారాలను పరిశుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తీరప్రాంతాలను సందర్శించే యాత్రికులు సముద్ర జలాలను కలుషితం చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, కోటపురి ఆరోరా తదితరుల పర్యవేక్షణలో ఎన్‌సిసి కేడెట్లు పరిసరాలను శుభ్రం చేశారు.


'సత్య'మేవ జయతే
ధర్మవరం.. ధర్మం వైపే నిలిచింది
సార్వత్రిక పోరులో 'సత్య'మే గెలిచింది.
ధర్మవరం శాసనసభ్యుడిగా
ఘనవిజయం సాధించిన మా ప్రియమిత్రుడు
సత్యకుమార్ యాదవ్ గారికి
విజయాభినందనలు.
- 'సత్య స్నేహితులు'

# మెడికవర్‌ని సందర్శించిన..శ్రీసిటీ ఎం.డీ



నెల్లూరులోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా.రవీంద్ర సన్నారెడ్డి ఈనెల 3న సందర్శించి, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు ఆయన్ను ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంట్రల్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, క్యాన్సర్ విభాగం హెడ్ డాక్టర్ బిందురెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ధరిత్రిని కాపాడుకుందాం




పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ప్రతి ఒక్కరూ ధరిత్రిని కాపాడు కోవాలని స్థానిక పొల్యూషన్ బోర్డు ఇంజనీర్ రాజశేఖర్ చెప్పారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని విశ్వసాయి స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విజేతలకు బహుమతులందించారు. పాఠశాల ఛైర్మెన్ డా.సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ రఘురాం, ప్రజా సైన్స్ సభ్యులు గాలి శ్రీనివాసులు, బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

# బాలూకు.. నివాళులు



గాన గంధర్వుడు, భారతీయ చలనచిత్ర గాయకుడు..మన నెల్లూరీయుడు డా.ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా జూన్ 4న నెల్లూరులోని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. నగరంలోని ఆదిత్యనగర్‌లో ఉన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మునిసిపల్ పార్కులోని బాలూ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చేతన కార్యదర్శి వై.శేషగిరీశం నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో చేతన కార్యవర్గసభ్యులు డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై. విశ్వనాధం, గట్టుపల్లి ఆదిశేషు, ఎస్. సుబ్బారాయుడు, నాట్యగురువు దివ్యపావని, గాయనీమణులు ఎన్.పద్మావతి, కె.విజయలక్ష్మి, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.




# నెల్లూరు కబుర్లు

# రగ్బీ క్రీడాకారులను అభినందించిన వేమిరెడ్డి



ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన 9వ రగ్బీ చాంపియన్‌షిప్ అండర్-18 బాలుర పోటీల్లో విజయం సాధించిన నెల్లూరు క్రీడాకారుల జట్టును నెల్లూరు పార్లమెంట్ ఎన్డీఏ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభినందించారు. కోవూరు జనసేన నాయకులు హరిరెడ్డి, శేఖర్‌ల ఆధ్వర్యంలో ఆ క్రీడాకారులు ఈనెల 3న నెల్లూరులోని వేమిరెడ్డి నివాసానికి వచ్చి ఆయన అభినందనలు అందుకున్నారు.

# ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

**- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి**



ఈ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని వైకాపా జిల్లాశాఖ అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 5న నెల్లూరులోని వైకాపా జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్ళలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు అన్నివిధాల మేలు చేసిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు 4 లక్షల 86వేల ఉద్యోగాలు కల్పించారని అన్నారు. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలు, కొత్తపోర్టులు, గ్రామ-వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్‌లు ఇలా అనేక సంస్కరణలతో వైకాపా ప్రభుత్వం ప్రజలకు సేవలు అందించిందని, అయినప్పటికీ ప్రజలు ఈ ఎన్నికల్లో మార్పు కోరుకొని రాబోయే అయిదేళ్ళు తెలుగుదేశం పార్టీకి అధికారమిచ్చారన్నారు. 40 శాతం మంది ప్రజలు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పార్టీకి అండగా నిలిచారని, వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్తున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అండగా వైకాపా సేవలందిస్తుందని ఆయన తెలిపారు.

# పచ్చని చెట్లు..ప్రగతికి మెట్లు




నెల్లూరులోని నెహ్రూ యువ కేంద్ర, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బుజబుజ నెల్లూరులోని శివాజీ కాలనీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ పచ్చని చెట్లు, ప్రగతికి మెట్లు అంటూ, పచ్చదనం పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్‌రాజు కె.జయరామ రాజు, సరస్వతి కృష్ణంరాజు, కె.నరసింహరాజు, మాచి రాజు ఈశ్వర్ రాజు, ఓంకారం వెంకట్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# హంస వాహనంపై హనుమ

హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు సంతపేటలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ నెల 4వ తేదీ ఉదయం స్వామివారికి పూలంగిసేవతో పాటు హంస వాహనోత్సవం వేడుకగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు.

## ○ 'నీట్' ఫలితాల్లో

# 'విశ్వసాయి' ప్రభంజనం



జూన్ 4వ తేది ప్రకటించిన జాతీయస్థాయి నీట్-2024 ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్‌తో అదరగొట్టారు. దాదాపు 110 మందికిపైగానే తమ విద్యార్థులు ఈ పరీక్షల్లో ఉత్తమంగా రాణిస్తూ, ఎంబీబీఎస్‌లో, బీడీఎస్‌లో చేరేందుకు అర్హత సాధించారని ఆ కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 5న స్థానిక అన్నమయ్య సర్కిల్‌లోని విశ్వసాయి కళాశాలలో విద్యార్థులను ఆయన అభినందించారు. నీట్ పరీక్షల్లో తమ కళాశాలకు చెందిన ఎస్.దీక్షిత 658 మార్కులు, కె.ప్రేమ్‌సాయి 636, ఎం.యశ్వంత్‌కుమార్ 632, కె.పూజిత 626, వై.గురుచంద్రిక 625, డిహెచ్‌విఎస్ సాయిశ్రియ 620, పి.శ్లోకారెడ్డి 612, జి. సత్యకార్తికేయశర్మ 600 మార్కులు సాధించారని ఆయన వివరించారు. కళాశాల వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎంతో పట్టుదలతో చదువుకుని మంచి ఫలితాలు సాధించుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# నీట్‌లో రత్నం విద్యార్థుల విజయదుందుభి



నీట్-2024 ఫలితాల్లో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం మెడికల్ అకాడమి విద్యార్థులు తమ ప్రతిభను చాటారని, ఈ అకాడమీ ప్రారంభించిన తొలి ఏడాదిలోనే విద్యార్థులు నీట్ ఫలితాల్లో తమ సత్తా చాటుకున్నారని అకాడమి డైరెక్టర్ డా. కిషోర్స్ రత్నం పేర్కొన్నారు. తమ విద్యార్థులు సీహెచ్ నాగసింధు 646 మార్కులు, వి.సాయినిత్యశ్రీ 626, డి.శరణ్య 556, ఏ.తప్యశ్రీ 526, వై.బిందు 522, ఎం.తిలగవతి 476 మార్కులు సాధించారని ఆయన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వాసంతి కిషోర్, రోషిణి, జీఎం రామ్మూర్తి నాయుడు, ప్రిన్సిపాల్ కేవీడీ మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'నారాయణ' ప్రతిభ



ఈనెల 4న ప్రకటించిన 'నీట్' ఫలితాల్లో నెల్లూరు నారాయణ మెడికల్ అకాడమి విద్యార్థులు విజయఢంకా మోగించారు. 720/720 మార్కులతో 1వ ర్యాంకుతోపాటు, 715, 715, 705, 700 వంటి అత్యుత్తమ మార్కులతో ఓపెన్ కేటగిరిలో 106, 135, 1310, 1987 వంటి జాతీయస్థాయి ర్యాంకులతో అగ్రస్థానంలో నిలిచారు. మెడికల్ విభాగంలో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరిలో నారాయణ విద్యాసంస్థల నుంచి 8మంది విద్యార్థులు మొదటి ర్యాంకు సాధించగా, అందులో నెల్లూరు నారాయణ మెడికల్ అకాడమి విద్యార్థి కె.సందీప్‌చౌదరి 720 మార్కులతో 1వ ర్యాంకు సాధించారు. కే.వెంకటసాత్విక్ 715 మార్కులతో 106వ ర్యాంకు, కె.సౌరబ్‌రెడ్డి 715 మార్కులతో 135వ ర్యాంకు, బి.ఫణిశ్రీ శశాంక్ 705 మార్కులతో 1310వ ర్యాంకు, ఏ.చెంచు ఈశ్వరప్రసాద్ 700 మార్కులతో 1987వ ర్యాంకు సాధించారని, దాదాపు 320 మెడికల్ సీట్లు నెల్లూరు నారాయణ విద్యార్థులు సాధించగలరని నారాయణ విద్యాసంస్థల వ్యవస్థాపకులు డా. నారాయణ, డైరెక్టర్ డాక్టర్ సింధూర, జనరల్ మేనేజర్ విజయభాస్కరరెడ్డి తెలియజేశారు.

## తనపై అభాండాలు వేసినా... సంయమనంతో ఘనవిజయం

# తొలి మహిళా ఎమ్మెల్యేగా ప్రశాంతిరెడ్డి

### కోవూరులో మిన్నంటిన సంతోషం



రాజకీయరంగంలో ఇటీవలే ప్రవేశించి అసెంబ్లీ ఎన్నికల్లో మొట్టమొదటి సారిగా పోటీచేసిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని ప్రజలు ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించడంతో సర్వత్రా సంబరాలు అంబరాన్నంటాయి. కోవూరు నియోజక వర్గంలో తొలి మహిళా శాసనసభ్యురాలిగా ప్రశాంతిరెడ్డి రికార్డు సృష్టించడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు మిన్నంటాయి. తన సమీప ప్రత్యర్థి, రాజకీయ యోధుడు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై ఆమె 52,363 ఓట్ల ఆధిక్యతతో విజయభేరీ మోగించడం సంచలనం సృష్టించింది. ఆమె గెలుపుతో జిల్లాలో నారీలోకానికి భరోసా ఇచ్చినట్లయింది. రాజకీయాలకు కొత్త అయినప్పటికీ ఆమె ప్రచార రంగంలో ముందుకు దూసుకుపోయారు.

తన భర్త, మహాదాత.. నెల్లూరు ఎంపీగా నిలిచి గెలిచిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అండదండలతో ఆమె ప్రత్యర్థి వర్గాన్ని సునాయాసంగానే జయించారు. కోవూరు నియోజకవర్గంలో వైకాపా కంచుకోటను బద్దలుకొట్టి తెలుగుదేశం జెండా ఎగరేశారు. ప్రచారపర్వంలోనే ఆమె కోవూరు ప్రజల మనసు గెలుచుకున్నారు. తనపై ప్రత్యర్థివర్గం లేనిపోని అభాండాలు వేసినా భరించి, నిబద్ధతతో ముందుకు సాగడం, కోవూరు తెలుగుదేశం పార్టీ నాయకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి సహకారంతో ఆచి తూచి అడుగువేస్తూ ప్రత్యర్థిని చిత్తు చేయడంలో తనకు తనే సాటి అనిపించుకున్నారు. తనను కోవూరు ఆడబిడ్డగా ఆదరించండంటూ ఆమె వినమ్రంగా కోరడం అక్కడి ప్రజలను బాగా ఆకట్టుకుంది. ప్రశాంతమ్మ వంటి ప్రశాంత హృదయురాలు తమకు నాయకురాలైతే కోవూరులో దీర్ఘకాలంగా తిష్టవేసుకున్న సమస్యలు సమసిపోతాయని అందరూ భావించారు. దీంతో ఏకపక్షంగా అనేక చోట్ల ఆమెకు భారీగా ఓట్లు పడ్డాయని భావిస్తున్నారు. అత్యధికశాతం పోలింగ్ బూత్‌లలో ఆమెకు ఆధిక్యత లభించడం విశేషం. చెప్పింది చేసే నాయకులుగా పేరెన్నికగన్న వేమిరెడ్డి దంపతులకు ఈ విజయం ఒక కానుకగా ఇస్తున్నామంటూ కోవూరు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వారి పాలనలో కోవూరు అభివృద్ధిని సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ, తెలుగుదేశం పాలనలోనే ప్రజలకు సంక్షేమం-అభివృద్ధి ఉంటాయని ఆశిస్తూ ప్రజలు పెద్దఎత్తున టీడీపీకి మద్దతు తెలపడంతో ఆమె గెలుపు సునాయాసమైంది. చంద్రబాబునాయుడు అందిస్తామన్న సూపర్ సిక్స్ పథకాల ప్రయోజనాలను నియోజకవర్గ ప్రజలకు తెలియజెప్పడంలో ఆమె ముందంజ వేశారు. అందుకు తగ్గట్టుగా 'అవినీతి రహిత కోవూరు'ను సాధించుకుందామంటూ ప్రశాంతిరెడ్డి చేసిన నినాదం ప్రజల మనసుల్లోకి దూసుకుపోయింది. కోవూరు నియోజకవర్గ ప్రజల సమస్యలు తీర్చడం కోసం తమ ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయనే నమ్మకాన్ని ప్రజలకు కలిగించడంలో ఆమె నూటికి నూరుశాతం సఫలీకృతులయ్యారు. అందుకే, గ్రామగ్రామానా ప్రజలు ఆమెకు హారతులు పట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రభంజనంతో పాటు ప్రశాంతిరెడ్డి ప్రచారహోరు తోడు కావడంతో కోవూరు నియోజకవర్గంలో ఆ పార్టీ తిరుగులేని మెజార్టీతో జయకేతనం ఎగురవేసింది.



## శ్రీసిటీలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పర్యావరణ హిత ప్రమాణాలతో సుస్థిర అభివృద్ధి దిశగా పయనిస్తున్న శ్రీసిటీలో ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగ అధికారి మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన సత్యవేడు అటవీశాఖ రేంజ్ అధికారి జి.జయప్రసాదరావు, చెన్నైకు చెందిన ప్రముఖ ఎపికల్చరిస్ట్ ప్రొఫెసర్ విలియం జేమ్స్ తదితరులు స్థానిక నర్సరీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు తగు కార్యాచరణ రూపొందించేందుకు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శ్రీసిటీ చేపట్టిన హరితహిత చర్యలను అభినందిస్తూ, శ్రీసిటీ పరిశ్రమలు, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు దీనికి సహకరించాలని కోరారు. పర్యావరణం, పరపరాగ సంపర్కంలో తేనెటీగల కీలక పాత్ర గురించి ప్రొఫెసర్ విలియం జేమ్స్ ఈ సందర్భంగా వివరించారు. తేనెటీగల నివాసాలను పరిరక్షించడం, రసాయనిక వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరుల లభ్యత, మొక్కలను సంరక్షించడం వంటి పలు పర్యావరణ అనుకూల పద్ధతులను ఆయన సూచించారు. ఆరోగ్యకరమైన తేనెటీగలు సమతుల్య పర్యావరణ వ్యవస్థకు పైన పేర్కొన్న పద్ధతులు అత్యంత కీలకమన్నారు. పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణలో సవాళ్లు, ఖచ్చితమైన ప్రణాళిక ఆవశ్యకత గురించి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో ప్రస్తావించారు. పరాగ సంపర్క సంరక్షణ ప్రాముఖ్యత దృష్ట్యా సీతాకోకచిలుకలు, తేనెటీగలు, ఇతర పక్షులు, కీటకాల సంరక్షణ కోసం శ్రీసిటీలో రెండు ఎకరాలలో పరాగ సంపర్క ఉద్యానవనం (పాలినేషన్ పార్క్) ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రీసిటీ ఉద్యానవన విభాగ అధికారి మధుసూదనరెడ్డి మాట్లాడుతూ, శ్రీసిటీలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఏర్పాటుచేసిన 'మియావాకి' ప్లాంటేషన్ గురించి వివరించారు. అందుకోసం 10 ఎకరాలలో 56కు పైగా స్థానిక జాతులకు చెందిన 50 వేలకు పైగా మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శ్రీసిటీలో పర్యావరణానికి పెద్దపీట వేస్తూ 10 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిరంతర మొక్కల నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.




# జెండా మోసిన వారికి అండగా 'నేనున్నా'నన్న నారాయణ

## కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా..'నారాయణ ఫౌండేషన్'

## తొలివిడతగా నలుగురికి రూ.20.5 లక్షల సాయం

ఏ పార్టీకైనా కార్యకర్తలే పునాదులు. వారెంత బలంగా ఉంటే ఆ పార్టీ కూడా బలోపేతంగా ఉంటుంది. తన కుటుంబ పరిస్థితులు ఎలా ఉన్నా, ఎండనక వాననక పార్టీలో తిరుగుతూ పార్టీ జెండా మోసి, నాయకుల గెలుపు కోసం నిరంతరం శ్రమించేదీ, వారి కోసం ఎన్ని కష్టనష్టాలకైనా సిద్ధపడేదీ కార్యకర్తలే. అందుకే, కార్యకర్తల సంక్షేమం.. వారి సౌభాగ్యం పార్టీ నాయకులకు ధ్యేయంగా ఉండాలంటూ నెల్లూరు నగర అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించిన మాజీమంత్రి, డా.పొంగూరు నారాయణ తన కుటుంబ సభ్యుల సహకారంతో ఇటీవల 'నారాయణ ఫౌండేషన్' ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, నాయకులను కూడా బాగా ఆకట్టుకుంటోంది. ఎన్నికల ఫలితాలు రాకముందే ఆయన పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, అందుకోసం ప్రతిఏటా అక్షరాలా పది కోట్ల రూపాయలను కేటాయిస్తున్నామని ప్రకటించడం, అది చూసి పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కూడా నారాయణ సహృదయాన్ని మెచ్చుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన నెల్లూరు నగర ఎమ్మెల్యేగా గెలవడంతో మరింత సంతోషంగా చెప్పిన మాట నిలబెట్టుకుంటూ ఈనెల 5న నెల్లూరు గోమతినగర్‌లో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తల సంక్షేమం కోసం 'నారాయణ ఫౌండేషన్' ఏర్పాటైందని, తమ కుటుంబ ఆదాయంతో ఆ నిధిని సమకూరుస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన తొలివిడతగా నలుగురు కార్యకర్తలకు సాయంగా 20 లక్షలా 50వేల రూపాయలను చెక్కుల రూపంలో అందజేయడంతో కార్యకర్తల్లో సంతోషం వెల్లువెత్తుతోంది.

నారాయణ ఫౌండేషన్ ద్వారా అర్హులకు, అవసరమైన వారికి వృత్తివిద్యా కోర్సులకు, మరికొంతమందికి ఉన్నత విద్యల కోసం ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. అదే విధంగా, పేద కార్యకర్తల పిల్లల వివాహాలకు, వారి కుటుంబాల్లో ఏవైనా కష్టాలు, అనారోగ్య పరిస్థితులు ఉంటే వారి వైద్య చికిత్సలకు ఈ ఫౌండేషన్ కింద చేయూత నందిస్తామని చెప్పారు. కార్యకర్తలను తన కుటుంబసభ్యులుగా భావిస్తున్నామని, పార్టీ కోసం అన్ని కష్టాలకు ఓర్చుకునే కార్యకర్తలకు అండగా, వారి కుటుంబాలకు భరోసాగా 'నేనున్నా'నన్నారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టమొచ్చినా తమను సంప్రదించి ఫౌండేషన్ ద్వారా తగు సాయం పొందవచ్చని చెప్పారు. నెల్లూరు చరిత్రలోనే ఎప్పుడూ లేనివిధంగా 72 వేల ఓట్లకు పైగానే భారీ మెజార్టీతో తనను ఈ ఎన్నికల్లో గెలిపించిన కార్యకర్తలందరికీ ఆయన ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలిపారు. తన ఆలోచనలకు అనుగుణంగా కార్యకర్తల కోసం ఏటా 10కోట్ల రూపాయలు సాయం అందించేందుకు ముందుకు వచ్చిన తన కుటుంబసభ్యులను ఆయన అభినందించారు. తన గెలుపు కోసం కష్టపడి పని చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ– జనసేన నాయకులు కార్యకర్తలకు, ప్రత్యేకించి నెల్లూరు నగర నియోజకవర్గ ప్రజలందరికీ తాను ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు అబ్దుల్ అజీజ్, నారాయణ కుటుంబ సభ్యులు పొంగూరు రమాదేవి, సింధూర, పునీత్, షరణి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## మొక్కలు నాటిన నెల్‌క్యాస్ట్ సిబ్బంది



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5వ తేదీ నెల్‌క్యాస్ట్ ఆవరణంలో సిబ్బంది 100 చెట్లను నాటారు. కాలుష్యాన్ని నివారించేందుకు ఈ చెట్లను నాటడం సంతోషాన్ని కలిగించిందని నెల్‌క్యాస్ట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) శ్రీరాం, ప్లాంట్ ఇన్‌ఛార్జ్ వెంకటేషన్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం హెచ్ఆర్ పళని మురుగన్, ఫైనాన్స్ సీనియర్ మేనేజర్ ప్రభు, పిఆర్ఓ ఆనిమెళ్ళ శివకుమార్, సేఫ్టీ ఇన్‌ఛార్జ్ డి.వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీనివాసమూర్తి, శశికుమార్, సిబ్బంది పాల్గొని చెట్లను నాటారు.

## బ్రాహ్మణ సేవాసంఘం మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



గూడూరు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఇటీవల కోర్టు సెంటర్‌లో ఉన్న ప్రయాణీకుల షెల్టర్ వద్ద గూడూరు టూటౌన్ సి.ఐ రవికిరణ్, గూడూరు రూరల్ సి.ఐ వేణుగోపాలరెడ్డి ద్వారా ప్రజలకు 500 మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బ్రాహ్మణ సేవాసంఘం వారు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. సంఘ ఉపాధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, కార్యదర్శి చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి లలితమ్మ, డి.బి.శ్రీనివాసరావు, నరసింహన్, కడివేటి రామమూర్తి పాల్గొని మాట్లాడారు. కోర్టు సెంటర్ దగ్గరలో ఉన్న బ్రాహ్మణ భవనాన్ని అతితక్కువ ఖర్చుతో బ్రాహ్మణులకు, ఇతర కులాల వారికి కూడా నిబంధనలతో ఇస్తున్నట్లు వారు తెలిపారు.

## మౌనాన్ని.. మౌనంతోనే



అతగాడొక నరకస
మౌన మునీంద్రుడు
రాజప్రాసాదాలే ఆయన
నివాస కుటీరాలు
ఆ దివ్య పురుషుని నవ్య దివ్య దర్శన భాగ్యమే దుర్లభం
మనుషుల్ని ప్రేమించడం, మనసుల్లో జీవించడం
సమాజానికి సుందర భవిష్యత్తు కలగనడం
ఆ పాలకుడెప్పుడో మరచిపోయాడు
'విత్తం' నాటి విత్తనాలు విరియలేదన్న
తారకమంత్ర అనియత భావోద్వేగం
కంటిచూపుగా మారి చాలా కాలమయింది
అతనొక పెళపెళార్భాటాలు చేస్తుంటే
నాలుకల చీలకల్తో మందలిస్తున్నారని
భ్రమపడ్డామేమో కాని అది నిజం కాలేదు
ఆ రాజ్యంలో ఏ దౌర్జన్యానికీ, ఏ దురాగతానికీ
ఉలుకూ పలుకూ లేని అభీష్టానికి నివ్వెరపోయాం
ఎవరిదారికి వాళ్ళను వదిలేసిన అపరిపక్వ
సిద్ధాంతానికి ఆయనో ధ్వజస్తంభం.
వెన్నెల చల్లని కబురు తనకే పరిమితమనుకున్న
కలువ'మామయ్య' అతగాడు
వెలుపల చిరునవ్వులు చిందించే దేవదూతగా ప్రత్యక్షమయి
లోపల 'శాటన్' రూపంలో ఒదిగిపోగలిగిన నేర్పరి
బ్యూరోకాట్లకు సోదర సోదర మంత్రం ఉపదేశించిన
అభినవ అభినయ సామ్రాట్టు అతగాడే
చితాభస్మంలోంచి పదవీ పరిమళం
సాధించగల అధునాతన అపరబ్రహ్మ!
అయితేనేం...
వేయిగొడ్లు తిన్న రాబందు.. చిన్న గాలివానకు కుప్పకూలినట్లు
జనజీవితాన్ని, జన జాగృతాన్ని పెను ఉత్పాతంలో ముంచిన
రాజకీయ జీవితం తడారిపోయింది
ఓ పెను నిశ్శబ్దం పెళ్ళుమని దభిల్లుమని
ఆకాశం చిల్లులు పడేలా స్వైర విహారం చేసింది
మౌనాన్ని మౌన విప్లవంతోనే జయించిన
విజ్ఞత ఆంధ్రుల 'కసికి'
నిలువెత్తు సాక్షాత్కారమే కాదా!
రేపటి నవనవోన్మేష ప్రస్థానానికిది
నాందీ వాచకమే కదా!



చిన్ని నారాయణరావు
9440202942



# జిల్లాకి మంత్రులెవరు?

ఎన్నికల ఘట్టం ముగిసింది. వైసీపీ అరాచకాలకి తెరపడింది. అనూహ్య ఫలితాలతో బీజేపీ – టీడీపీ – జనసేన కూటమి 164 సీట్లని కైవసం చేసుకుని జూన్ 12వ తేదీన కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. టీడీపీ మద్దతుతో కేంద్రంలో జూన్ 9న మోడీ సర్కారు కొలువుతీరబోతోంది. ఓవైపు వైసీపీ శ్రేణులు తాము ఎదుర్కున్న ఘోర పరాభవానికి కారణాలని వెతుక్కోవడంలో తలమునకలై ఉంటే, మరోవైపు కూటమి నేతలు మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు, అధికార నియామకాల కసరత్తులో యమబిజీగా ఉన్నారు.

## కేంద్రమంత్రిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి?

మరో రెండు రోజుల్లో మూడవసారి కుర్చీ ఎక్కబోతున్న బీజేపీ ప్రభుత్వంలో నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి మంత్రి పదవి ఛాన్స్ దక్కబోతోందని విశ్వసనీయ సమాచారం. నిజానికి వేమిరెడ్డి దంపతుల చేరికతో టీడీపీకి రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఊపిరి వచ్చినట్లయ్యిందని పలు సందర్భాలలో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. బీజేపీతో ఒప్పందం కుదిరి 3 లేదా 4 కేంద్రమంత్రి పదవులు ఆంధ్రాకి దక్కే పక్షంలో రెడ్డి సామాజిక వర్గం నుండి అన్ని విధాలా అర్హత వున్న వ్యక్తిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పేరే ప్రధానంగా వినపడుతోంది. నీతి, నిజాయితీలతో పాటు కమలనాథుల క్యాబినెట్‌లో పనిచేయగల సత్తా, సమర్థత, ప్రభాకరరెడ్డికి ఉన్నాయన్నది విశ్లేషకుల అభిప్రాయం. ఇటు రాష్ట్రంలో టీడీపీకి అటు ఢిల్లీలో బీజేపీకి ప్రభాకరరెడ్డి పేరే ఆమోదయోగ్యంగా ఉండబోతోందని వార్తలొస్తున్నాయి. ఆధ్యాత్మిక చింతనతో, దైవాన్ని ఎక్కువగా నమ్మే ప్రభాకరరెడ్డి దంపతులు ఈ ఎన్నికలలో తీసుకున్న ప్రతి నిర్ణయం వారికి కలిసొచ్చింది. ఇప్పుడు కేంద్రమంత్రి పదవి కూడా రావడం ఖాయమని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు.

## టీటీడీ బోర్డు సభ్యురాలిగా ప్రశాంతిరెడ్డి?

వేమిరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డి కోరుకుంటే రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కూడా లభిస్తుంది. అయితే తమకి మంత్రి పదవికన్నా దైవ సేవే ప్రధానమని ఆమె భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పడబోయే టీటీడీ ట్రస్టు బోర్డులో మళ్ళీ స్థానం పొందడానికే ఆమె మొగ్గు చూపుతున్నారని తెలిసింది.

## మంత్రివర్గ రేసులో పొంగూరు, సోమిరెడ్డి, నారాయణ?

రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరికి చోటు లభించబోతోందన్న చర్చ కూడా జిల్లాలో జోరుగా సాగుతోంది. ఇప్పటికే నారాయణ పేరు ప్రథమంగా వినిపిస్తోంటే, సీనియర్ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి పేర్లు కూడా ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నట్లు, ఈమేరకు టీడీపీ అధిష్టానం ఆయనకి హామీ ఇచ్చినట్లు కోటంరెడ్డి కోటరీ ప్రచారం చేసుకుంటోంది. నెల్లూరుజిల్లాలో ఒక రెడ్డికి తప్పక అవకాశం ఇవ్వాలి కాబట్టి ఆ రెడ్డి ఎవరన్నది తెలియాలంటే జూన్ 12 వరకూ వేచి చూడాల్సిందే!



## చంద్రబాబు, లోకేష్‌లను కలిసిన వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు ఎంపీగా విజయం సాధించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యేగా గెలిచిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఈనెల 6న అమరావతిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరు జిల్లాలో ఎంపీగా, ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన వేమిరెడ్డి దంపతులను ఈ సందర్భంగా చంద్రబాబు, లోకేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వారివెంట నెల్లూరు నగర డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# ఆత్మకూరులో మూడు దశాబ్దాల తరువాత టీడీపీ జోరు

## 7576 ఓట్ల మెజారిటీతో సైకిలెక్కిన ఆనం రామనారాయణరెడ్డి

దాదాపు 30 సంవత్సరాల తరువాత పాత కొత్త నెల్లూరు జిల్లాలోని అన్ని స్థానాలలో సైకిల్ జోరు కనిపించింది. ఇందులో భాగంగా ఆత్మకూరు నియోజకవర్గ ఓటర్లు కూడా ఈసారి సైకిల్‌కే జై కొట్టారు. చివరివరకు ఉత్కంఠతో సాగిన ఆత్మకూరు నియోజకవర్గంలో తన ప్రత్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డిపై 7576 ఓట్ల ఆధిక్యతో ఆనం విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత



1983లో జరిగిన ఎన్నికలలో ఆ పార్టీ అభ్యర్థిగా రామనారాయణరెడ్డి తండ్రి స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి ఆత్మకూరు శాసనసభ్యుడిగా గెలిచారు. అనంతరం 1994లో కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. మళ్ళీ మూడు దశాబ్దాల తరువాత ఆత్మకూరులో టీడీపీ హవా కనిపించింది. అక్కడి ఓటర్లు ఆనం రామనారాయణ రెడ్డిని సైకిల్ ఎక్కించారు.



శ్రీ కట్టంరెడ్డి కోటారెడ్డి గారు
నిర్యాణం : 03.06.2024

ఉత్తరక్రియలు

ఆదర్శమూర్తి, ఆత్మీయ దీప్తి, మా కంటి వెలుగు, మా ఇంటి దైవం
శ్రీ కట్టంరెడ్డి కోటారెడ్డి గారు
తేది. 03.06.2024 సోమవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : కట్టంరెడ్డి పద్మావతమ్మ
కుమారుడు - కోడలు
కట్టంరెడ్డి వెంకటశేషారెడ్డి - సుమ
కుమార్తెలు - అల్లుళ్ళు
అరుణ - పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి
(మాజీ శాసనసభ్యులు, కోవూరు)
లేట్ అనసూయ - పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి
మనుమళ్ళు - మనుమరాళ్ళు
కట్టంరెడ్డి సునీష్‌రెడ్డి - విద్య
శృతి - దొడ్ల వెంకట శ్రావణ్‌రెడ్డి
పోలంరెడ్డి దినేష్‌రెడ్డి - శ్రీనిత్య
(టిడిపి జాతీయ అధికార ప్రతినిధి)
దివ్య - బొల్లవరం వరుణ్‌రెడ్డి
పచ్చిపాల సతీష్‌రెడ్డి - శ్వేత
పచ్చిపాల సనత్‌రెడ్డి - పూజిత
మునిమనుమడు : కట్టంరెడ్డి షన్విక్‌రెడ్డి
మరియు మునిమనుమళ్ళు, మునిమనుమరాళ్ళు

ఉత్తరక్రియలు : వారి పెద్దకర్మ తేది. 13.06.2024 గురువారం
నెల్లూరుజిల్లా, లేబూరు గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# ఉతికి ఆరేశారు

(మొదటిపేజీ తరువాయి)

బయట పెట్టింది. రివర్స్ టెండరింగ్ అంటూ చేసిన నినాదం జగన్ ఆలోచనలని బయటపెట్టింది. మద్యం, ఇసుక, మైనింగ్ వంటి వ్యాపారాలని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని సలహాదారుల పర్యవేక్షణలో తన సొంత మనుషులకి అప్పజెప్పడం ఆయనలోని వ్యాపార గుణాన్ని ప్రస్ఫుటం చేసింది. తన తల్లి, చెల్లితో సహా ఎవరినీ దగ్గరకి రానీయలేదు. ఎవరికీ అపాయింట్‌మెంటు ఇవ్వలేదు. మంత్రులని, ఎంఎల్‌ఏలని, పార్టీ నాయకులని సైతం దూరంగా పెట్టారు. తానెవరినైనా కలవాలనుకుంటే కలవాల్సిందే తప్ప తనని ఎవరైనా కలవాలంటే అది అసాధ్యం అనే భావన కలిగేలా తన చుట్టూ కంచె ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్రం తన స్వంత కంపెనీ అన్నట్లుగా, తన సలహాదారులు తమ కంపెనీ డైరెక్టర్లు అన్నట్లుగా వ్యవస్థని రూపొందించుకున్నారు. మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులను తమ కంపెనీ ప్రతినిధులన్నట్లుగా భావించారు. ఇక పార్టీ నాయకులు కార్యకర్తలను తమ సంస్థలోని ఉద్యోగులన్నట్లుగా వ్యవహరించారు. వీటన్నిటినీ మించి తాను ఏడాదికొకసారి బటన్లు నొక్కి డబ్బులిస్తున్న ప్రజలని తన సంస్థ కార్మికులలా ఊహించుకున్నారు. తాను డబ్బులిస్తున్నాను కాబట్టి తన వెనుక తోక ఊపుకుంటూ వచ్చి తనకి ఓట్లేసి గెలిపిస్తారనుకున్నారు.

జనం ఆలా చేయలేదు. జగన్ అనుకున్నది ఓటర్లు నిజం కానీయలేదు. వ్యాపారం వేరు రాజకీయం వేరు అన్నట్లుగా స్పష్టమైన సంకేతం ఇచ్చారు. డబ్బులిస్తే నీకు లొంగడానికి మేము మీ బానిసలం కాదన్నట్లుగా జగన్ వ్యూహాన్ని తిప్పి కొట్టారు. దిమ్మతిరిగేలా తీర్పుచెప్పి, జగన్ తీరు నచ్చలేదని చెప్పేశారు. వై.ఎస్. ఫోటో పక్కన తన ఫోటో పెట్టుకునేలా పరిపాలిస్తానన్న జగన్‌పై కోపంతో వాళ్ళ నాన్న ఫోటో కూడా తీసేస్తారేమో అన్న స్థాయిలో అప్రతిష్ఠని మూటకట్టుకున్నారు జగన్.

## సర్వం సజ్జలై.. సర్వనాశనం చేశారు!

తాను అద్దాల బోనులో కూర్చొని పార్టీతో పాటు ప్రభుత్వ పెత్తనం కూడా సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పచెప్పడం జగన్ చేసిన అతి పెద్ద తప్పిదం. తాను తన కుమారుడు చేసే కార్యక్రమాల గుట్టు బయటకి రాకుండా సజ్జల జాగ్రత్తపడాలని పథకం రచించుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో భయంకరమైన అవినీతికి, అక్రమాలకు, దుర్మార్గాలకి పాల్పడిన పార్టీ నేతల భాగోతాలు జగన్ దాకా చేరకుండా జాగ్రత్త పడ్డాడు. మీకు దొరికింది మీరు దోచుకొండి – మాకు దొరికింది మేం దోచుకుంటాం... అన్నట్లుగా రాష్ట్రం మీద పడ్డారు. అహంకార పోకడతో మంత్రులు జబ్బలు చరచడం, తొడలు కొట్టడం వంటి వికృత చేష్టలు చేస్తుంటే, సజ్జల సంబర పడిపోయి చప్పట్లు కొట్టాడు తప్ప, వాళ్ళ ఛండాలపు చర్యల వల్ల తమ పార్టీకి, తద్వారా తమ నాయకుడికి జరుగుతున్న నష్టాన్ని గుర్తించలేకపోయారు. మహిళలు సైతం అసహ్యించుకునేలా మంత్రుల నోళ్ళలో నుంచి వచ్చిన నీచాతి నీచమైన బూతు పురాణాలని పెడచెవిన పెట్టారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసీపీకి శాపనార్థాలు పెట్టినా పట్టించుకోలేదు. "తిట్టిపోదురు గాక నాకేమి సిగ్గు" అన్నట్లుగా వ్యవహరించారు.

రాష్ట్రాన్ని నాలుగు భాగాలుగా జగన్ చుట్టూ వున్న ఆ నలుగురు పెద్దమనుషులు పంచుకున్నారు. తడ నుండి ఇచ్ఛాపురం వరకూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఫలితంగా ఘోరాతి ఘోరమైన ఓటమితో కూటమి దెబ్బకి బలైపోయారు.

గత ఐదేళ్లలో జగన్ పాలనలో కొనసాగిన అవకతవకలు, అక్రమాలు, అర్ధరహిత నిర్ణయాలు, అవినీతి పరంపరలు, కిచెన్ క్యాబినెట్ ప్రహసనాలు, నలుగురి దుర్మార్గాలు చర్చించాలంటే ఒక్క వారంలో అసాధ్యం. రాబోవు సంచికలలో ఒక్కొక్కటిగా చర్చించుకుందాం. వీటన్నిటి కారణంగానే వైసీపీ అబాసు పాలయ్యింది. ఆ పార్టీ అడ్రస్ గల్లంతయ్యింది, అహంకారపు ఆధిపత్యంతో, అనుభవ రాహిత్యంతో అధికార పైత్యంతో అథఃపాతాళానికి పడిపోయింది. 151 సీట్లు సాధించుకున్న పార్టీ 5ఏళ్ళ తర్వాత తమ ప్రత్యర్థికి 164 సీట్లు వచ్చే స్థాయిలో తన దుష్టపాలనను సాగించింది.

## కోటి ఆశలతో కొలువుదీరనున్న కూటమి

తెలుగుదేశం–బీజెపీ–జనసేన కూటమికి ఈ ఎన్నికల్లో ప్రజలు కనీవినీ ఎరుగనంత విజయాన్ని చేకూర్చడం విశేషం. మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను 164 స్థానాల్లోనూ కూటమికి ఘనవిజయమే. అంతేకాదు, 25 లోక్‌సభ స్థానాల్లో 21 సీట్లు కూటమికే లభించాయంటే వైకాపా పట్ల ప్రజలు ఎంతగా విసిగిపోయారో తేటతెల్లమవుతుంది. కూటమి ప్రభంజనంలో వైకాపా ఫ్యాన్ గాలికి కొట్టుకుపోయింది. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు మొత్తం 55.28 శాతం ఓట్లు సాధించగా, వైకాపా కేవలం 39.37 శాతానికి సరిపెట్టుకుంది. వైకాపా కంటే కూటమికి 53,72,166 ఓట్లు అధికంగా వచ్చాయి. 144 స్థానాల్లో పోటీచేసిన తెలుగుదేశం పార్టీ 135 చోట్ల విజయం సాధించింది. గత ఎన్నికల్లో 2 స్థానాల్లో పోటీచేసి ఆ రెండుస్థానాల్లోనూ ఓడిపోయిన పవన్ పార్టీ జనసేన..ఇప్పుడు ఏకంగా 21 స్థానాల్లోనూ విజయదుందుభి మోగించింది. భారతీయ జనతాపార్టీ 10 స్థానాల్లో పోటీచేస్తే, అందులో 8 స్థానాల్లో జయకేతనం ఎగరేసింది. అదేవిధంగా, లోక్‌సభ స్థానాల్లోనూ కూటమి దెబ్బకు ఫ్యాన్‌కు గిరగిరా దిమ్మతిరిగిపోయింది. మొత్తం 25 లోక్‌సభ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 16, బీజేపీ 3, జనసేన 2 స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఎన్నికల్లో వైకాపా కేవలం 11 శాసనసభ, 4 లోక్‌సభ స్థానాలకు పరిమితమైపోవడం ఆ పార్టీ పూర్తిస్థాయిలో చతికిలబడిపోయిందనడానికి నిదర్శనం. చంద్రబాబు పోటీలో ఉన్న కుప్పాన్ని కూడా గెలుచుకుంటామని బీరాలు పలికిన జగన్, తాను పోటీచేసిన పులివెందులలో గత ఎన్నికల్లో కంటే 30 వేలకు పైగానే మెజార్టీ తగ్గిపోవడంతో కంగుతినక తప్పలేదు. కేవలం అరకు, పాడేరు, ఎర్రగొండపాళెం, బద్వేల్, రాజంపేట, పులివెందుల, మంత్రాలయం, ఆలూరు, తంబళ్లపల్లె, పుంగనూరు, దర్శి నియోజకవర్గాల్లో (మొత్తం 11) మాత్రమే వైకాపా గెలిచింది. 8 ఉమ్మడి జిల్లాల్లో వైకాపా ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. జగన్ సొంత జిల్లా కడపలోనే కేవలం 3 స్థానాలకే పరిమితవమైపోయింది. కనీసం విపక్ష హోదా కూడా దక్కనంత అట్టడుగుకు ఆ పార్టీ చేరిపోయింది. దేశ చరిత్రలోనే ఒక అధికార పార్టీ ఇంత ఘోరంగా ఓడిపోవడం బహుశా ఇదే తొలిసారి. గత ఎన్నికల్లో తెలుగుదేశం కూడా ఘోరపరాజయాన్నే ఎదుర్కొంది. టీడీపీకి 23 స్థానాలే వచ్చాయని అప్పట్లో ఎద్దేవా చేసిన వైకాపాకి ఇప్పుడు అందులో సరిగ్గా సగం కూడా రాలేదు. లోక్‌సభ స్థానాల్లో కూడా కూటమి తన సత్తా చాటింది. 21 అసెంబ్లీ స్థానాల్లోనూ, 2 లోక్‌సభ స్థానాల్లోనూ పోటీచేసిన జనసేన, ఒక్కటి కూడా తప్పిపోకుండా అన్నిచోట్లా గెలిచి, నూటికి నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో సంచలనం సృష్టించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామగ్రామానా, వాడవాడలా వైకాపా పట్ల విపరీతమైన వ్యతిరేకత వ్యక్తమైంది. దాంతో ఆ అరాచకపాలనకు జనమే చరమగీతం పాడేశారు. క్లీన్ స్వీప్ చేస్తూ వైకాపాను పూర్తిగా తుడిచిపెట్టేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లతో పాటు బీజేపీ నాయకులు కూడా ఈ ఎన్నికల్లో ఎంతో సంయమనంతో ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు సాగడంతో ఎన్నికల్లో కూటమి జయకేతనం ఎగరేసింది.

మొత్తానికి రాజకీయాలలో హత్యలుండవు, ఆత్మహత్యలే అనడానికి ఈ ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి ఘోర పరాజయమే నిదర్శనం!



## జాతీయస్థాయి కీలకనేతగా చంద్రబాబు

కూటమి విజయంతో ఢిల్లీలోనూ చంద్రబాబు హవా పెరిగిపోయింది. సుమారు మూడు దశాబ్దాల తర్వాత మళ్ళీ ఢిల్లీలో చంద్రబాబు చక్రం తిప్పే అవకాశం వచ్చింది. ఎన్డీఏ కూటమిలో రెండవ అతిపెద్ద పార్టీగా తెలుగుదేశం పార్టీ అవతరించడంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు టీడీపీ మద్దతు అవసరం కావడంతో జాతీయస్థాయిలో టీడీపీ ప్రాధాన్యత గల పార్టీగా మారింది. ప్రధాని మోడీ నివాసంలో జరిగిన ఎన్డీఏ కూటమి సమావేశంలో కూడా బీజేపీ నేతలు చంద్రబాబుకు పెద్దపీట వేశారు. ప్రధాని మోడీకి ఒకవైపు బీజేపీ నాయకులు, మరోవైపు చంద్రబాబు, నితీశ్‌కుమార్‌లు కూర్చుని ప్రధానితో మాట్లాడుతుండడం జాతీయ మీడియాలో హైలైట్‌గా మారింది. బీజేపీ నేతలు జేపీ నడ్డా, అమిత్‌షా, పీయూష్‌గోయల్ తదితరులతో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడడం దేశవ్యాప్తంగా ప్రసారమాధ్యమాల్లో వైరల్ అవుతుండడం విశేషం.



## ఎంపీలకు చంద్రబాబు అభినందనలు

ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీ అభ్యర్థులతో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈనెల 6న సమావేశమై ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ భేటీలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, విశాఖ ఎంపీ భరత్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులున్నారు.



ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును ఇటీవల కలసి ఆత్మీయంగా సన్మానిస్తున్న కర్నాటక తెలుగుదేశం పార్టీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి



ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన వేమిరెడ్డి దంపతులను ఇటీవల నెల్లూరులోని వారి నివాసంలో కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేస్తున్న కోవూరు తెలుగుదేశం నాయకులు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి




## ఉద్యోగులను నిర్లక్ష్యం చేసినందుకే..

# వైకాపాకు ఈ దుర్గతి

రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్న ఉద్యోగులను నిర్లక్ష్యం చేయడమేకాక, వారి మనోభావాలను దెబ్బతీసినందువల్లే వైకాపా ఘోర ఓటమిని చవిచూడాల్సివచ్చిందని పలు ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల్లో వైకాపా పరాజయం తర్వాత ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు అల్లంపాటి పెంచల రెడ్డి, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు ఈనెల 4న వేర్వేరు ప్రకటనల్లో అయిదేళ్ల వైకాపా పాలనలో జగన్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల మొండి వైఖరి అవలంభించిదని, దాని పర్యవసానంగానే ఓటమి పాలైందని అభిప్రాయపడ్డారు.

## ప్రముఖ న్యాయవాది..

# తన్నీరు కోటయ్య కన్నుమూత



వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతి కోసం శ్రమించిన మానవతావాది, ప్రముఖ న్యాయవాది తన్నీరు కోటయ్య ఈనెల 4న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన స్వస్థలం కందుకూరు. చిన్నతనంలోనే నెల్లూరుకు వచ్చిన వారి కుటుంబం ఇక్కడే స్థిరపడిపోయింది. దాదాపు నాలుగు దశాబ్దాలకు పైగానే నెల్లూరులో న్యాయవాదిగా పనిచేస్తూ పేదల పక్షపాతిగా మంచి పేరు తెచ్చుకున్న కోటయ్య లాయర్ల సంఘాలకు నాయకునిగా కూడా వ్యవహరించారు. వామపక్ష భావజాలంతో అనేక ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. కోటయ్య మృతికి రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఉమామహేశ్వరరెడ్డి, పి.సుందరయ్యయాదవ్, ప్రముఖ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, జి.బాలసుబ్రహ్మణ్యం, షేక్ నన్నేసాహెబ్, జల్లి పద్మాకర్, పీసీ కృష్ణయ్య, జి. దయాకర్ తదితరులు సంతాపం తెలిపారు. కోటయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.





# అంగరంగ వైభవంగా.. హనుమాన్ శోభాయాత్ర

## --- శ్రీరామ నామ స్మరణలతో మార్మోగిన సింహపురి ---

'జై శ్రీరామ్', 'జై హనుమాన్'..అంటూ పెద్దపెట్టున భక్తులు చేస్తున్న శ్రీరామ నామ సంకీర్తనలు, హనుమాన్ భజనలతో నెల్లూరు నగరం పులకించిపోయింది. హనుమజ్జయంతి సంద ర్భంగా హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 2వ తేది జై హనుమాన్ అంటూ పతాకాలు చేతపట్టి ఈ శోభాయాత్ర నిర్వ హించారు. శ్రీరాముడు, హనుమంతుడి విగ్రహమూర్తులను వాహనాలపై కొలువుదీర్చి, ద్విచక్ర వాహనాలతో హనుమాన్ భక్తబృందం ర్యాలీగా తరలిరాగా, అడుగడుగునా ప్రజలు హారతు లిచ్చి స్వాగతించారు. వేదిక రాష్ట్ర నాయకులు నాగ శ్రీనివాస్, కాకు మురళీరెడ్డి, జిల్లా కన్వీనర్ పీజీ మహేష్, ఎస్.వెంకటేశ్వర్లు, సాయి శ్రీనివాస్, పీఎస్‌వీ సాయి, పి. శంకరయ్య, ప్రణీత్‌రెడ్డి, లవకుశ ట్రస్టు సభ్యులు డి.విజయకుమార్, పైడా హేమంత్‌ల పర్యవేక్షణలో వందలాది మంది భక్తజనం, మహిళా భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. బుద్ధికి, కార్యసిద్ధికి, స్వామి భక్తికి, పరాక్రమానికి హనుమంతుడు ప్రతీక అని, అలాంటి హనుమ గుణగణాలను సమాజం పుణికిపుచ్చుకుని ముందుకు సాగాలని కోరుకుంటూ హనుమాన్ శోభాయాత్ర నగర వీధుల్లో మంగళ వాద్యాలు, కోలాటాలు, భజనలతో పెద్దఎత్తున నిర్వహించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుండి శోభాయాత్ర ప్రారంభమైంది. కొండాయపాళెం గేట్ సెంటర్, ఎంజీబీమాల్, కెవిఆర్ పెట్రోలు బంకు కూడలి, ఆర్టీసీ బస్టాండు, వీఆర్‌సీ సెంటర్, గాంధీబొమ్మ, శివాజీ సెంటర్, ఏసీ సెంటర్‌ల మీదుగా స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఆర్ మునిసిపల్ పాఠశాల వరకు కోలాహలంగా ప్రదర్శన సాగింది. అయోధ్య నుండి తీసుకువచ్చిన ప్రతిమలతో ఏర్పాటుచేసి ఉన్న శ్రీరామదర్బార్‌లో భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఈ వేడుకకు భారీ బందోబస్తు చేపట్టింది. గత కొన్నేళ్ళుగా ఏటా నిర్వహిస్తున్న హనుమాన్ శోభాయాత్రలకు ఇలాగే ప్రజల నుంచి మంచి స్పందన ఉంటోందని ఈ సందర్భంగా నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ ముస్లిమ్ సోదరులు కూడా ముందుకు వచ్చి, శోభాయాత్రలో పాల్గొన్న భక్తులందరికీ మజ్జిగ, చల్లని నీరు ఇచ్చి సేద తీర్చడం విశేషం. దేవతామూర్తుల వేషధారణలతో చిన్నారులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.



## జానకిరామ.. రామాయణం (16)

- ఊటుకూరు జానకి రామారావు

వశిష్ట మహర్షి మహారాజు ఆందోళన గమనించి రాజా ఏదో ప్రమాదం ముంచుకొస్తున్నది. కానీ, పక్షులప్రవర్తన చూస్తే అది తొలగి పోతుంది అని కూడా తెలుస్తున్నది! కాబట్టి శాంతచిత్తుడవై ఉండు! అని ధైర్యవచనాలు పలికాడు.

వారు మాట్లాడుకుంటూ ఉన్నారు, ఇంతలో గాలి ప్రచండంగా వీస్తూ భూమిమీద చెట్లను వేళ్ళతోసహా పెకిలిస్తూ తనతో తీసుకు వెడుతున్నది. మహావృక్షాలు సైతం గాలిలో వేళ్ళాడుతున్నాయి. భూమి ఒక్కసారిగా కంపించటం మొదలుపెట్టింది! చతురంగ బలాలన్నిటిమీద బూడిద కప్పివేయగా దశరధుడు, ఆయన కుమారులూ, కోడళ్ళు, వశిష్టాదిమునిగణము తప్ప అందరూ మూర్ఛపోయారు.

భూమి అంతటినీ చిమ్మచీకటి ఆవరించింది. ఆ చీకటిలో వారికి దూరంగా ఒక తేజోపుంజం కనపడ్డది. అది అతివేగంగా వారిని సమీపించింది. అప్పుడు ఆ తేజస్సు చూడశక్యం కానంత కాంతితో వెలుగొందుతుంది.

ఆ తేజోపుంజము మరేమిటో కాదు జటామండలము ధరించి, భయంకరంగా భూమిమీద రాజులను సంహరించి భుజంమీద గండ్రగొడ్డలి ధరించిన పరశురాముని రూపం.

ఆ మహానుభావుడు వారి ఎదుట ప్రత్యక్షమై వశిష్ట మహర్షి ఇచ్చిన అర్ఘ్యపాద్యాదులు స్వీకరించి అత్యంత గంభీర స్వరంతో ఇక్కడ ఎవడురా "రాముడు" అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్న వినగానే దశరధుడికి ప్రాణం పోయినంత పని అయ్యింది చివురుటాకులాగ వణికిపోయాడు దశరథుడు.

ఇంద్రుడి వద్ద ఇక శస్త్రము ముట్టనని ప్రమాణము చేసి, సంపాదించిన భూమినంతా కశ్యపుడికి దానంచేసి, మహేంద్రగిరి మీద వానప్రస్థం గడుపుతున్న ఈయన (పరశురాముడు) ఇచ్చటికి ఇలాగ ఉన్నపళంగా, ఈ రాజకులాంతకుడు ఎందుకు వచ్చాడు !? మదిలో ఈ ప్రశ్న కలకలం రేపుతున్నది దశరధునకు.

పరశురాముడు తన ఎదురుగా ఉన్న రామునితో,

రామా! నీ పరాక్రమము అద్భుతము!

శివధనుస్సు విరచినావని విన్నంతనే నీవెంతటి వాడివో తెలుసుకోవాలని మరియొక ధనుస్సు తెచ్చినాను ఇదిగో చూడు!

కొన్ని కారణాలవల్ల శివధనుస్సు బలహీనముగా ఉంది. ఇది అత్యంత దృఢమైన వైష్ణవ ధనువు! మా తండ్రి గారి వద్దనుండి నాకు ప్రాప్తించినది.

ఈ వైష్ణవ ధనుస్సు ఎక్కుపెట్టి శరసంధానము చేయవోయ్! నీ బలమేమిటో అప్పుడు తెలుస్తుంది.

అప్పుడు నీకు నాతో ద్వంద్వయుద్ధాన్ని అనుగ్రహిస్తాను అని పరశు రాముడు పలికినమాటలు దశరధుడి గుండెలలో ములుకులుగా గుచ్చుకొని, భార్గవా! నా రాముడు పసిబాలుడు!

ఇప్పుడిప్పుడే జీవితంలో అడుగుపెడుతున్నాడు! జీవనమాధుర్యమేదీ ఇంతవరకు రుచిచూసి ఎరుగడు!

ఇంకా కాళ్ళ పారాణి ఆరలేదు! పసివాడింకా వాడు!

నా రామునకు ఏ విధమైన అమంగళము ప్రాప్తించినా మేమెవ్వరమూ జీవించలేము!

ఈ వేడుకోలు మాటలేవీ పరశురాముడు వినటంలేదు! ఇంకా గట్టిగా మాట్లాడుతూ!

రామా! నీవు సుక్షత్రియుడవే అయినట్లయితే ఈ వైష్ణవ ధనుస్సును ఎక్కుపెట్టు! అని హుంకరిస్తూ తనను రెచ్చగొట్టాలని ప్రయత్నిస్తున్న భార్గవరాముని చూచి దశరథరాముడు చాలా "తగ్గిన గొంతుతో" ఇలా అంటున్నాడు.

దశరథ మహారాజు పరశురాముడి కాళ్ళా వేళ్ళ బడుతున్నాడు, వేడుకుంటున్నాడు!

తన బలమేమిటో తనకు సంపూర్ణంగా తెలుసు, అయినా! తండ్రి మాట్లాడుతున్నప్పుడు, రాముడు, ఏమిటి ఈయనతో మాట్లేడేది నాన్నా! ఈయన సంగతి నేను చూస్తాను! అని పొరపాటున గూడా మాట్లాడలేదు!

అలా మాట్లాడితే తండ్రిని తగ్గించినట్లవుతుంది!

అది తన అహంకార ప్రదర్శన అవుతుంది!

పరశురాముడికి జవాబిచ్చే సందర్భంలో తగ్గిన గొంతుతో సంభాషిస్తాడు రాముడు, ఇక్కడ రాముని గుణగణాలు తెలుస్తాయి.

తండ్రి ఎదుట, గురువు ఎదుట, పెద్దలెదుట ఎప్పుడూ పెద్దగొంతేసుకొని మాటలాడరాదు!

అందుకే వాల్మీకి మహర్షి ఈ శ్లోకం ఇలా చెపుతారు.

***శ్రుత్వా త జ్జామదగ్న్యస్య వాక్యం దాశరథి స్తదా***
***గౌరవాద్యంత్రిత కధః పితూ రామ మధాబ్రవీత్.***

***పితుఃగౌరవాత్ యంత్రితకథః*** తండ్రి మీద గౌరవం వలన తగ్గింపబడిన సంభాషణము కలవాడై.

రామాయణమ్ మనకు జీవన విలువలను నేర్పుతుంది!


ప్రతి సన్నివేశంలోనూ జీవన విలువలే! అందుకే రామాయణమ్ జీవనపారాయణమ్ కావాలి!

రాముడు గొంతు తగ్గించి మృదువుగా... పరశురామా! నీ కథలు పెద్దలు చెప్పగా విన్నాను. అమోఘమైన నీ పితృభక్తి, తండ్రి ఋణము నీవు తీర్చుకున్న విధానము ఇతరులకు సాధ్యముకానిది.

నన్ను పరాక్రమం లేనివాని వలే, క్షత్రియధర్మాచరణ సాధ్యముకాని వలే, తేజోహీనుని వలే అవమానిస్తున్నావు!

నా పరాక్రమము నీకు చూడవలెనున్నదా ! అయితే ఇదిగోచూడు అంటూ పరశురాముని చేతినుండి చాపము, శరము తీసుకొని విల్లెక్కుపెట్టి శరసంధానము చేసి, క్రుద్ధుడై! నీవు బ్రాహ్మణుడవు కావున నీ ప్రాణము తీయను.

నేను ఒక్కసారి బాణం సంధిస్తే అది వృధాగా పోరాదు! నీ పాదగమనశక్తిని కొట్టమంటావా!



నీవు తపస్సుచే సంపాదించుకున్న ఉత్తమలోకాలను కొట్టమంటావా! అని అడిగాడు శ్రీరాముడు!.

రాముడు వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టగనే పరశురాముడు నిర్వీర్యుడై, జడుడై, నిశ్చేష్టుడయ్యాడు.

అప్పుడు పరశురాముడు మెల్లగా రామా!

నా గమన శక్తిని కొట్టవద్దు, నా తపోలోకములను కొట్టుము.

ఇక ఆలస్యం చేయకు అనగా.. రాముడు అట్లే చేసినాడు!

నేను నీ చేతిలో పరాజితుడనయినాను, అందుకు నేను సిగ్గుపడను అని పలికి రాముని చేతిలో భంగపడినవాడై మహేంద్రగిరికి అతి వేగముగా వెళ్ళిపోయినాడు.

పరశురాముడు వెళ్ళిన పిదప రాముడు ఆ ధనుస్సును, శరమును వరుణునకు అప్పగించివేశాడు!.

తండ్రి వైపు తిరిగి, తండ్రీ తదుపరి కర్తవ్యాన్ని సెలవివ్వండి! మీ అధీనంలోని చతురంగబలాలను అయోధ్యవైపు కదలటానికి అనుజ్ఞ ఇవ్వండి అని వినయంగా పలికాడు!

ఒక్కసారిగా నడిసంద్రంలో పెనుతుఫాను వెలిసి గండంగడిచిన నావికుడి హృదయంలాగ దశరథుడి మనస్సు తేలికపడి, రాముని తన బాహువులతో కౌగలించుకొని శిరస్సుపై ముద్దిడి ఆనందభరితుడయినాడు.

అయోధ్య చేరుకున్నారంతా!

కౌసల్యా, సుమిత్ర, కైకేయి కొత్తకోడళ్లకు ఎదురేగి ఆహ్వానంపలికి మంగళకరంగా గృహదేవతలను పూజించి పెద్దలందరి దీవెనెలు కోడళ్లకు ఇప్పించి ఎన్నో భూరిదానాలు చేశారు.

నూతన దంపతులు సుఖంగా కాలం గడపసాగారు.

కొంతకాలానికి మేనమామ యుధాజిత్తుతో కలసి భరతుడు, శత్రుఘ్నునితో కూడి వారి వారి భార్యలను వెంటనిడుకొని కేకయ రాజ్యానికి ప్రయాణమయినారు.

శ్రీరామచంద్రుడు, లక్ష్మణుడు తండ్రికి సేవచేస్తూ పురజనుల అభిమానాన్ని చూరగొంటున్నారు.


సీతారాములు అన్యోన్య ప్రేమతో ఆనందంగా కాలం గడుపుతున్నారు. సీత అంటే రాముడు, రాముడు అంటే సీత... వీరిరువురికీ భేదం లేదు అని లోకం చెప్పుకోనారంభించింది!

శ్రీమద్రామయణంలోని బాలకాండ సమాప్తము

.. (సశేషం)

## నెల్లూరు టిడిపి ఎంపీ అభ్యర్థిగా

# విపిఆర్ ఘన విజయం



- 2,45,902 ఓట్ల భారీ మెజార్టీ
- పాతికేళ్ల తర్వాత తొలి టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డే

**నెల్లూరు ఎంపీ స్థానానికి తెలుగుదేశం-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ఈ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించారు. వివాదరహితుడు, ఆదర్శనాయకుడు, సామాజిక-ఆధ్యాత్మిక సేవాపరాయణుడు, మానవతా హృదయంతో కోట్లాది రూపాయలను ప్రజల కోసం వెచ్చిస్తున్న మహాదాత విపిఆర్‌కు జిల్లా ప్రజలు జై కొట్టారు. అహరహం ప్రజల అభ్యున్నతి కోసం, పేదప్రజల బాగు కోసం తపించే ఒక మంచి నాయకుడిని ఎంపీగా ఎన్నుకుని నెల్లూరీయులు తమ విజ్ఞతను చాటుకున్నారు.**

నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గానికి ఘనమైన చరిత్రే ఉంది. ఉద్దండులైన మహానాయకులెందరో నెల్లూరు నియోజకవర్గం నుంచి ఎంపీలుగా ఎన్నికై దేశవ్యాప్తంగా నెల్లూరు వాణిని వినిపించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత పుచ్చలపల్లి పెంచలయ్య, (1984), ఉక్కాల రాజేశ్వరమ్మ(1999)లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా ఇక్కడ నుంచి గెలిచారు. అప్పట్లో ఈ నియోజకవర్గం రిజర్వుడ్ నియోజకవర్గంగా ఉండేది. 2009లో నెల్లూరు నియోజకవర్గం జనరల్ స్థానంగా మారింది. జనరల్‌గా మారిన అనంతరం 2009, 2012లలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఒకసారి కాంగ్రెస్‌పార్టీ నుండి, ఆ తరువాత జరిగిన ఉపఎన్నికలో వైసీపీ నుండి ఎంపీగా ఎన్నిక కాగా, 2014లో ఆదాల వైసీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. ఇప్పుడు పాతికేళ్ళ తరువాత మళ్ళీ టీడీపీ అభ్యర్థిగా గెలిచిన వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డే కావడం విశేషం. ఈ ఎన్నికల్లో (2024) తన సమీప ప్రత్యర్థి..వైకాపా అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిపై విపిఆర్ ఏకంగా 2 లక్షలా 45వేలా 902 ఓట్ల భారీ మెజార్టీతో గెలిచి..దటీజ్ విపిఆర్ అనిపించారు. ప్రత్యక్ష రాజకీయాల్లోనూ తనకు సాటిలేదని నిరూపించుకున్నారు.

### ఒకరిని కాదనుకుంటే.. ఇద్దరు గెలిచారు

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజకీయప్రస్థానం బహు విచిత్రం. ఇటీవలి వరకు ఆయన వైకాపాలో ఉన్నా, వైకాపా అధిష్టానం తీరు నచ్చక ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడం జిల్లాలోనే కాదు, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఆ సేవామూర్తిని పార్టీలోకి చేర్చుకోవడం కోసం నేరుగా టీడీపీ అధినేత చంద్రబాబే నెల్లూరుకు వచ్చారు. నెల్లూరు పార్లమెంట్ స్థానానికి ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు అసెంబ్లీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆయన రంగంలోకి దింపారు. దీంతో జిల్లా రాజకీయ స్వరూపమే మారిపోయింది. విపిఆర్ వంటి మంచివారు కూడా వైకాపాని వదిలిపెట్టేశారంటే వైకాపా తీరు ఎంత అధ్వాన్నంగా ఉందో ప్రజలకు స్పష్టమైపోయింది. వైకాపా ఒకరిని (విపిఆర్‌ని) కాదనుకుంటే, ఇద్దరు (ప్రశాంతిరెడ్డితో సహా) ఎన్నికల రంగంలోకి దిగడంతో వైకాపా అధిష్టానం బిత్తరపోయింది. అందుకు ధీటుగా వైకాపాలో కీలకనేతగా ఉన్న రాజ్యసభ సభ్యుడు..వేణుంబాక విజయసాయిరెడ్డిని రంగంలోకి దింపి ఇక గెలుపు తమదే అనుకుంది. కానీ, ప్రజలు సహృదయులైన వేమిరెడ్డి దంపతులనే ఆశీర్వదించారు. విపిఆర్‌కు బ్రహ్మరథం పట్టారు. అటు విజయసాయిరెడ్డికి, ఇటు కోవూరు రాజకీయ కొదమసింహం నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికీ బైబై చెప్పారు. ఆ ఇద్దరికి మాత్రమే కాక, ఈ దెబ్బతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైకాపా అభ్యర్థులందరినీ ఓడించి ఇళ్లకు సాగనంపారు.

# కల చెదిరింది

(3వ పేజీ తరువాయి)

తాను ఖచ్చితంగా గెలువబోతున్నాననే పగటి కలలని కన్నాడు. తన పార్టీ నాయకులు ఇచ్చిన సారాయి సీసా, బిరియాని పొట్లం, 500 నోటుతో సిద్ధం సభలకి వచ్చిన జనాలని చూసి వాపుని బలుపనుకున్నారు. కానీ, తీరా ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చే సరికి ఆయన దిమ్మ తిరిగింది. 151 నుండి 11 సీట్లకి జనం జగన్‌ని పరిమితం చేయడం జగన్ కలలో కూడా ఊహించని పరిణామం.

### 151 చరిత్ర అయితే.. 11 మరో చరిత్ర!

సాధారణంగా ప్రతి ఒక్కరూ గెలిచినవారి గురించే మాట్లాడతారు. కానీ, ఈసారి ప్రజలు జగన్ ఓటమి గురించి మాట్లాడుకుంటున్నారు. ఎందుకంటే.. జగన్ గతంలో సాధించిన విజయం అప్పటికి కనీ వినీ ఎరుగనిది, అదో చరిత్ర. అయితే, ఇప్పుడు జగన్ మూటగట్టుకున్న పరాజయం కూడా అలాంటిదే, ఇది మరో చరిత్ర.

సాధారణంగా ఓ పెద్ద కుదుపు జరిగినప్పుడు మాత్రమే ఇలాంటి ఫలితాలు వస్తాయి. కానీ, అలాంటివేమీ ఇప్పుడు లేవని జగన్ భావించాడు. అయితే, ఆయన అయిదేళ్ల పాలనలో జరిగిన అనేక పరిణామాల తీరు ఫలితం ఆయన కల చెదిరింది. ఒక్కడుగా మొదలైన జగన్, ఇప్పుడు ఒంటరిగా మిగిలాడు...!

# కథ మారింది

(3వ పేజీ తరువాయి)

పరిస్థితుల్లో వారికి తిరుగులేదనే అంతా అనుకుంటారు. అంతే స్థాయిలో వారి ప్రచారం కూడా హోరెత్తింది. టీవీలలో, సామాజిక మాధ్యమాలలో ప్రధాని నరేంద్రమోడీ చేసే కార్యక్రమాలతో మోత మోగించింది. అయితే, ఇక్కడ ప్రతిపక్ష "ఇండియా" కూటమి బాగా కష్టపడి పనిచేస్తున్న విషయాన్ని ఎన్డీయే గ్రహించలేక పోయింది. బీజేపీ చేసిన తప్పిదాలను ప్రజల్లోకి తీసుకుపోయే క్రమంలో ప్రతిపక్ష కూటమి చేసిన ప్రయత్నాలను గుర్తించలేకపోయింది. రాహుల్‌గాంధీని టార్గెట్ చేస్తూ, ఆయనని పప్పులా చూపిస్తూ తాము చేయాల్సిన పనిని విస్మరించింది.

గడచిన పదేళ్ల పాలనలో అభివృద్ధికి పెద్దపీట వేసినా తాము చేసిన స్వీయ తప్పిదాల కారణంగా ఈసారి చావు తప్పి కన్ను లొట్టపోయిందన్నట్లుగా బయట పడింది. గతంలో భారీగా సీట్లను సాధించిన బీజేపీ, ఈసారి సొంతగా మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేకపోయింది. చివరి రోజుల్లో ఎవరినైతే తమ పంచన చేర్చుకుని ఆదరించామని భావించిందో, ఈరోజు వాళ్ళ పంచనే చేరాల్సిన పరిస్థితిలో ఆ పార్టీ పడిపోయింది. పదేళ్ల పాలన తర్వాత కూడా కాంగ్రెస్‌ను కుటుంబ పార్టీ అంటూ విమర్శించడం, ఇతర పార్టీల నాయకులకు ఎర్రతివాచీ పరచడం, మతమే ప్రజల అభిమతమని ఊహించుకుని పాలన సాగించడం వంటి సంఘటనలతో సీన్ మారింది. ఎన్డీయే కోరుకున్నట్లుగా కాకుండా ఆపార్టీ కథ మారింది...!

# మతం.. మా అభి'మతం' కాదు

(మొదటిపేజీ తరువాయి)

ఒకప్పుడు రెండు సీట్లతో సరిపెట్టుకున్న బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం అద్భుతమైన విజయం అని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు. ప్రపంచమంతా మెచ్చిన నాయకుడి గొప్పతనాన్ని ప్రజలు గ్రహించలేదా... లేకుంటే ప్రజల అభిమతాన్ని ఎన్డీయేనే గ్రహించలేదా... అసలు ఎందుకిలా...?

ఎన్నికల్లో 240 సీట్లు సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించి బీజేపీ సంబరాలు చేసుకుంటూ ఉంటే, అందరూ 99 సీట్లు సాధించి రెండో స్థానానికి ఎగబాకిన కాంగ్రెస్ గురించి మాట్లాడ్డం మొదలు పెట్టారు. దీనికి కారణం లేకపోలేదు. బీజేపీ గెలిచినా బలహీనపడింది. కాంగ్రెస్ ఓడినా బలం పుంజుకుంది. అంతా బాగానే ఉంది అనుకున్న బీజేపీ, కొంప మునిగిందెక్కడో అర్థం చేసుకోలేని స్థితిలో లేదు, ప్రజలు కూడా లేరు. అయితే ప్రజల్ని అర్థం చేసుకోవటంలో మాత్రం బీజేపీ పప్పులో కాలేసింది. నిజంగా ప్రజలకు కావలసింది ఏమిటో పూర్తిగా గ్రహించలేకపోయింది. అందుకే గెలుపు మలుపులో తడబడుతూ ముందుకు సాగాల్సిన పరిస్థితిని తెచ్చుకుంది.

ఇటీవల వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో బీజేపీ దేశమంతా పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. పదేళ్ల పాలన అద్భుతమని చెప్పుకునేందుకు ఉవ్విళ్ళూరింది. అయితే, "మనం చెప్పింది జనం వినటం కాదు. జనం చెప్పింది మనం చేయాలి" అనే ప్రజాస్వామ్య సూత్రాన్ని విస్మరించిందనే విషయం ఈ ఫలితాలతో వారికి అర్థం అవుతుంది. గతంలో దేశం వెలిగిపోతోంది అన్న నినాదం ఎలాంటి ఫలితాన్ని ఇచ్చిందో, ఇప్పుడు వికసిత్ భారత్ నినాదం అంతకంటే గొప్ప ఫలితాన్నేమీ ఇవ్వలేదు. 400 సీట్లు అనుకుంటే కథ అడ్డం తిరిగి, మిత్రపక్షాలతో కలుపుకుని 300కూడా చేరుకోలేని దుస్థితి ఏర్పడింది.

అయోధ్యలో రామమందిర నిర్మాణం అంశమే బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చిందని చాలామంది బలంగా నమ్ముతారు. అది అవునని కానీ, కాదని కానీ బీజేపీ ఎప్పుడూ చెప్పలేదు. అయితే రామ మందిర నిర్మాణం తర్వాత తమకు ఢోకా లేదనుకున్నారు. అయోధ్యలో గెలుపు ముంగిట చతికిలబడ్డారు. పోనీ ఉత్తరప్రదేశ్ లో ఏమన్నా కలిసొచ్చిందా అంటే పేలవమైన ప్రదర్శనతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ప్రజల అభిమతం వేరే ఉందన్న విషయాన్ని బీజేపీ పసిగట్టలేకపోయింది. మతం మాత్రమే తమను గట్టెక్కించలేదని తెలుసుకోలేకపోయింది. అదృష్టవశాత్తు చంద్రబాబు, నితీష్‌లతో పెట్టుకున్న పొత్తు సత్ఫలితాలను ఇచ్చి, ప్రభుత్వ ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేసింది.

అయోధ్యలో రామమందిరం నిర్మాణం కాకపోయినా గత ఎన్నికల్లో బీజేపీ కళ్ళు తిరిగే మెజారిటీ సంపాదించింది. మోడీ మానియా గట్టిగా పని చేసిందనే మాటలూ వినిపించాయి. అయితే రామ మందిరం నిర్మాణం జరిగిన తరువాత ఇచ్చిన తీర్పులో మోదీ పాలనకు ప్రజలు అత్తెసరు మార్కులే వేశారు. కాలం చెల్లిన సిద్ధాంతాలని వదిలిపెట్టమన్న సంకేతం ఇచ్చారు. ఈ విషయాన్ని గ్రహించగలిగితే భవిష్యత్తులో మళ్ళీ ఎన్డీయే అధికారానికి ఢోకా ఉండదు. లేదంటే కాంగ్రెస్ పదేళ్ళుగా పడిన పాట్లను చూస్తూనే ఉన్నాము. ఒకానొక సమయంలో కాంగ్రెస్ ముక్త భారత్ వచ్చినట్టే అనిపించింది. అయితే ఏ నాయకుడైతే బలహీనతగా కనిపించాడో, ఇప్పుడు అదే నాయకుడు కాంగ్రెస్ బలాన్ని రుచి చూపించాడు. పట్టుమని వంద సీట్లు కూడా రాకున్నా 56 అంగుళాల ఛాతీలో వణుకు పుట్టించాడు. పప్పు అన్న ఆవహేళనల మధ్య, తన పప్పులు ఉడుకుతాయని నిరూపించి చూపించాడు.

మొన్న మొన్నటి వరకూ రాజ్యసభలో బీజేపీ సంఖ్యా బలం చాలా తక్కువగా ఉండేది. ఇప్పుడు లోక్‌సభలోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో ఒక బిల్లు పాస్ కావాలంటే కత్తి మీద సాము చెయ్యాల్సిందే. ఈ ఎన్నికలు బీజేపీతో పాటు, యావత్ ప్రపంచానికి ఓ కొత్త పాఠాన్ని పరిచయం చేశాయి. గెలుపోటములు దైవాధీనాలే అయినప్పటికీ మన ఓటమి చూసి ఓదార్చే వాళ్ళు ఉండాలి గానీ, విజయంలో కూడా ఓదార్పు అవసరమయ్యేలా పరిస్థితులను మార్చుకోకూడదు. చంద్రబాబు, నితీష్ లేకపోయి ఉంటే ఎన్డీయే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోలేం. వారిద్దరినీ కూటమి స్వాగతించింది. అయితే వాళ్ళిద్దరూ అతుకుల బొంత వైపు ఆకర్షితులయ్యేంత అమాయకులేం కాదు. వీరిద్దరూ అటు వెళితే... మరో పది మంది ఇటు వస్తారని వాళ్ళకు బాగా తెలుసు.

మొత్తంమీద ఈ ఎన్నికల ఫలితాలు భవిష్యత్తులో బీజేపీ చాలా పాఠాలు నేర్చుకోవాలని చెప్పకనే చెప్పాయి. మతం తమ అభిమతం కాదన్నట్లుగా తీర్పు చెప్పి తమ మనోగతాన్ని భారతీయ ఓటర్లు కమలనాథుల ముందు ఆవిష్కరించారు..!



## జొన్నవాడలో నిత్యాన్నదానానికి భక్తుల విరాళం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో నిత్యాన్నదానానికి లేబూరు గ్రామానికి చెందిన భక్తులు వెంకటరామిరెడ్డి-కోటేశ్వ రమ్మ దంపతులు ఈనెల 3న లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. అదేవిధంగా నెల్లూరు సరస్వతినగర్‌కు చెందిన కోడూరు సాన్విక అనే భక్తురాలు అమ్మవారి దేవాలయానికి రూ.55,800 రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఆమేరకు చెక్కును ఆమె ఆలయ కార్యనిర్వహణాధికారి గిరికృష్ణకు అంద జేశారు. ఆలయ అర్చకులు ఈ సందర్భంగా దాతలను అభి నందించి ఆశీర్వదించారు.

## ఏఎన్ఎం సేవాభావం



### - 'హంస' ప్రతినిధుల సన్మానం -

విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి ప్రాణాపాయంలో ఉండడాన్ని గమనించిన ఏఎన్ఎం వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స (సీపీఆర్) చేసి ఆ వ్యక్తి ప్రాణాలు కాపాడి అందరి అభినందనలు అందుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొడవలూరు మండలం గంగవరంలోని రామచంద్రాపురం కాలనీకి చెందిన ఏసోబు ఇటీవల ఉన్నట్లుండి విద్యుత్ షాక్‌కు గురై అపస్మారకస్థితిలోకి వెళ్లిపోవడంతో, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏఎన్ఎం సర్వేపల్లి శ్యామల ఆయనకు సత్వర చికిత్స అందించి, తదుపరి అత్యవసర వైద్యం కోసం 108ని పిలిపించి ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడారు. అందుకు ఆమెను అభినందిస్తూ, ఈనెల 2న ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వై.వెంక టేశ్వర్లు తదితరులు అభినందించి సన్మానించారు. నెల్లూరు పెద్దాసుపత్రి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మజారుల్లా, ఉమా మహేశ్వరి, శ్రీనివాసులు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాథునికి.. వేడుకగా వసంతోత్సవాలు



నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయంలో ఈనెల 3 నుంచి వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి, ఉభయ దేవేరులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం దివ్యప్రబంధ గోష్ఠి, ఆస్థాన సేవ, ప్రాకారోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. డాక్టర్ సి.విజయసారథి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను తిలకించారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

## ఫ్యాక్టరీ నిబంధనల సరళీకరణపై.. శ్రీసిటీలో సదస్సు





ఏపీ ఫ్యాక్టరీల చట్టంలోని సెక్షన్ 106-బి క్రింద నేరాలు, శిక్షల నిబంధనల సరళీ కరణపై అభిప్రాయాలు, సూచనలను కోరుతూ రాష్ట్ర పరిశ్రమల డైరెక్టర్ డి.చంద్రశేఖర వర్మ ఇటీవల శ్రీసిటీలో శ్రీసిటీ పరిశ్రమలు, ఆ ప్రాంతంలోని ఇతర పరిశ్రమల సీనియర్ హెచ్ఆర్ మేనేజర్లతో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిత్తూరు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ వి.రామకృష్ణారెడ్డి పాల్గొని పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. 2016లో ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీల చట్టం, నిబంధనలలోని సెక్షన్ 106-బి కింద మొదటిసారిగా నేరాలను ప్రాసిక్యూషన్‌కు బదులు జరిమానా విధించే వెసులుబాటు కల్పించడం వల్ల, మరికొన్ని సవరణలు పరిశ్రమల భద్రతా వ్యవస్థలో మార్పులు తెస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ మార్పు దేశంలోని ఇతర రాష్ట్రాలలో అమలులో ఉందన్నారు. ఫ్యాక్టరీ భద్రతా పరమైన కొన్ని అతిక్రమణ నేరాలకు సంబంధించిన చట్టపరమైన ప్రక్రియను సరళీకరించడం, లేదా క్రమబద్ధీకరించడం ఈ సవరణల లక్ష్యమని ఆయన చెప్పారు. అటువంటి నేరాలను ప్రాసిక్యూషన్‌కు బదులుగా జరిమానా చెల్లించడం ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రతిపాదిస్తున్న సవరణ అనుమతిస్తుందని, తద్వారా, ఇటు కార్మికులు, యాజమాన్యాలకు, ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యజమానులు సుదీర్ఘమైన చట్టపరమైన ప్రక్రియను ఎదుర్కో కుండా, తొలిసారిగా జరిగిన అతిక్రమణ పునరావృతం కాకుండా సరిదిద్దడానికి అధీకృత అధికారి సమ్మేళనం చేయవచ్చునని వివరించారు. ఈ సంస్కరణల ద్వారా చట్టపరమైన వివాదాల సంఖ్యను తగ్గించడం, ఆర్థిక జరిమానాలు విధించడాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కొన్ని చిన్న చిన్న నేరాలను కోర్టు వెలుపల సులువుగా పరిష్కరించడానికి ఇవి మార్గాన్నిసుగమం చేస్తాయని, అయితే పరిశ్రమల భద్రతా నిబంధనల ఉల్లంఘనకు ఏ మాత్రం ఆస్కారం ఉండదన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాన్ని అభినందించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కార్మిక చట్టాలను సరళీకృతం చేయడం, క్రమబద్ధీకరించడం లక్ష్యంగా ఈ సంస్కరణలు కొత్త అభివృద్ధి శకానికి దారితీస్తాయని తాను విశ్వసిస్తున్నానన్నారు. ఈ సదస్సుకు దాదాపు 150 మంది హాజరయ్యారు.

## పొగాకుకు బానిసలు కావొద్దు

### - వైద్యుల హితవు

పొగతాగడం వల్ల, పొగాకు ఉత్పత్తులు వినియోగించడం వల్ల గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధుల వంటి అనేక రకాల జబ్బులు వస్తాయని, కనుక పొగాకుకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని నెల్లూరులోని ప్రముఖ చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ బి. కృష్ణమూర్తి చెప్పారు. పొగాకు వ్యతిరేకదినం సందర్భంగా నెల్లూరు వేదాయపాళెంలోని అలెన్ రాయల్ దంత వైద్యశాల, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యంగా 18నుంచి 24 సంవత్సరాల లోపు వయసు ఉండేవారు పొగాకు ఉత్పత్తులు వాడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తుల్లో ఉండే రసాయనాల వలన మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ తగ్గుతుందని, గుట్కా, ఖైనీ, పొగాకు నమలడం వలన నోటి మరియు శ్వాసకోశ క్యాన్సర్లు వస్తున్నాయని, వీటివల్ల ఆయుష్షు క్షీణిస్తుందన్నారు. ధూమపానం నరాల బలహీనతకి, నపుంసకత్వానికి దారితీస్తుందని, అధిక రక్తపోటు, గుండెపోటు, నిద్రలేమి, అల్సర్, అసిడిటీ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని, కంటి చూపు, రుచిని గ్రహించే శక్తిని కోల్పోవడం జరుగుతుందని తెలిపారు. ప్రముఖ కాస్మోటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ విద్య మాట్లాడుతూ పొగతాగడం వల్ల, పొగాకు ఉత్ప త్తులను నమలడం వల్ల దంతాలకు ఉండే చిగుళ్ళు కరిగిపోయి, రంగు మారిపోతాయని, నాలుక, గొంతు, నోరు, అన్నవాహిక ప్రాంతాల్లో క్యాన్సరు వ్యాపిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా పీహెచ్‌పి నాయకులు డాక్టర్ విద్య, డాక్టర్ కృష్ణమూర్తిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## 8న బాలూ జయంతి వేడుకలు

గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు ఈనెల 8న నెల్లూరు పురమందిరంలో నిర్వహించనున్నామని 'చేతన' సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక కార్యదర్శి వై.శేషగిరిశం తెలిపారు. ప్రముఖ సినీకవి భువనచంద్ర, సినీగాయని ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్ తదితరులు పాల్గొంటారని, ఈ సందర్భంగా ప్రముఖ సినీ సంగీత దర్శకులు విద్యాసాగర్‌కు బాలూ అవార్డును బహుకరించనున్నామని పేర్కొన్నారు. ఆరోజు సాయంత్రం 6.30 నుంచి అన్నమయ్య చిత్రంలో బాలూ పాడిన పాటలకు నృత్యనీరాజనం, ప్రముఖ గాయనీ గాయకులు నాగార్జున, శైలజల బాలు సినీచిత్ర గీతావళి కార్యక్రమం ఉంటాయని, బాలూ అభిమానులు..సంగీత సాహిత్యాభిమానులందరూ తరలిరావాలని ఆయన కోరారు.

## టూకీగా...



### తల్పగిరి రంగనాథునికి చందనాలంకారం

నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయంలో ఈనెల 2న స్వామివారికి ఆలయ అర్చకులు కన్నులపండువగా చందనాలంకారం నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ ఏ.వి శ్రీనివాసులు పర్యవేక్షించారు.

### కోవూరులో పేపర్ క్రాఫ్టింగ్‌పై శిక్షణ

కోవూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా, ఇటీవల ఉపాధ్యాయుడు వి.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పేపర్ క్రాఫ్టింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ వేసవి రోజుల్లో సమయాన్ని వృథా చేసుకోకుండా సృజ నాత్మకశక్తిని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా లైబ్రేరి యన్ జె.సురేంద్రరెడ్డి వారికి సూచించారు.

### దాసరిపల్లి వద్ద బైక్ బోల్తా..వ్యక్తి దుర్మరణం

నేలటూరు నివాసి రమణయ్య మే 30న పనిమీద కొండాపురానికి బైక్‌లో వెళ్తుండగా, మార్గమధ్యంలో ఉదయగిరి మండలం దాసరిపల్లి వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మే 30న ఈ దుర్ఘటన జరిగింది. ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డిలు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### కసుమూరులో భక్తుల కిటకిట

ఈనెల 2న ఆదివారం సందర్భంగా వెంకటాచలం మండలంలోని కసుమూరులో ఉన్న మస్తాన్‌వలీ దర్గా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు మస్తాన్‌వలీ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు అన్నదానాలు చేశారు.

### కేఆర్‌పురంలో గడ్డివాములు దగ్ధం

మనుబోలులోని కేఆర్‌పురంలో ఈనెల 2నఅర్ధరాత్రి వేళ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, అక్కడే ఉన్న మందాటి కోటి, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లుకు చెందిన గడ్డివాములు కాలిపోయాయి. ఎస్ఐ అజయ్‌కుమార్ వచ్చి పరిశీలించి, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో, వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

### రాపూరులో విద్యార్థులకు ఆటల పోటీలు

రాపూరు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా ఈనెల 2న విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి వారిలో క్రీడాసక్తిని ప్రోత్సహించారు. లైబ్రేరియన్ ధనమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలలు పాల్గొని పలు ఆటల్లో మేటిగా నిలిచారు.

### గండవరం యోగా గురువుకు సన్మానం

కొడవలూరు మండలం గండవరంలోని ఆయుర్వేద వైద్యశాల యోగా శిక్షకుడు జ్యోతి రాజేంద్రకుమార్‌ను ఈనెల 2న కోవూరులోని జనచైతన్య యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యోగ సాధనతో అనేక ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చని ఆయన సూచించారు.

### పొదలకూరు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరునికి రథోత్సవం

పొదలకూరులోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాల యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 2న స్వామివారికి కన్నులపండువగా రథోత్సవం జరిగింది. ఆలయ మాడవీధుల్లో స్వామివారిని-అమ్మవార్లను ఊరేగించిన తర్వాత, చక్రస్నానం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి బ్రహ్మోత్సవాలను తిలకించి తరించారు.

### ఆముదాలదిన్నె గిరిజనులకు బిర్యానీ ప్యాకెట్లు

కావలి ఇందిరానగర్‌కి చెందిన షేక్ షాఫహద్‌కు ఉన్నత చదువులతో మంచి ఉద్యోగం వచ్చిన సందర్భంగా, కావలి రూరల్‌లోని ఆముదాలదిన్నె గ్రామ గిరిజనులకు ఇటీవల ఆయన బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కావలి హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సయ్యద్ నౌషద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ అభినందనలు



పరిమళించే మానవత్వం.. మూర్తీభవించే సేవాతత్వం
మంచిని పెంచే మనస్తత్వం.. విపిఆర్ దంపతుల వ్యక్తిత్వం

నెల్లూరు పార్లమెంటు సభ్యుడిగా
**2,45,902**
ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించిన
## వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారికి

కోవూరు శాసనసభ్యురాలిగా
**54,583**
ఓట్ల మెజారిటీతో ప్రజాశీస్సులు పొందిన
## వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గారికి

ఆత్మీయ అభినందనలు.

Value beyond Bricks
SMD HOMES
BANGALORE - BHARATH

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com